# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 15-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 278 పేజీలు 8 వెల: రూ.1/-


## కేరళ, మహారాష్ట్రలకు ఓవైసీ పదిలక్షల సాయం

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం అవుతున్న కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాలకు తన వంతు ఆర్థిక సాయం చేసేందుకు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ముందుకొచ్చారు. ఈ రెండు రాష్ట్రాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్లో ఓవైసీ ప్రకటించారు. ఈ నగదును నేరుగా ఆయా రాష్ట్రాల చీఫ్‌మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌కు జమ చేస్తామని ఓవైసీ తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి కేరళ, మహారాష్ట్రతో పాటు కర్ణాటకలు భారీ వర్షాలు కురుస్తున్న విషయం విదితమే. కేరళలో ఇప్పటి వరకు 91 మంది మృతి చెందగా, 59 మంది అదృశ్యమయ్యారు. 14 జిల్లాల్లో వరద ముంపునకు గురయ్యాయి. మహారాష్ట్రలో 43 మంది ప్రాణాలు కోల్పోయారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

# పంద్రాగస్ట్ వేడుకలకు ముస్తాబైన గోల్కొండ కోట

హైదరాబాద్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చారిత్రక గోల్కొండ కోట ముస్తాబైంది.

భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటుకోటను అందంగా అలంకరించారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించాలన్న సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయంతో వరుసగా ఐదోసారి కెసిఆర్ జెండా ఎగురేయబోతున్నారు. ఇక్కడి నుంచే ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఈ యేడు బాగా వర్షాలు పడి జలకళను సంతరించుకోవడం, కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి కావడం వంటి విజయాలు సిఎం కెసిఆర్‌కు బాగా కలసివచ్చిన అంశాలుగా చూడాలి. అలాగే పొరుగున ఎపిలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో పాటు, సిఎం జగన్‌తో చర్చలు,గోదావరి జలాల వినియోగంపై ప్రత్యేక ప్రస్తావనచేసే అవకాశం ఉంది. సాధారణంగా పాలనలో తీసుకున్న చర్యలను,సాధించిన విజయాలను సిఎం వివరిస్తారు. రానున్న రోజుల్లో తీసుకోబోయే కార్యక్రమాలను విడమరుస్తారు. అలాగే అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తారు. గతంలో పరేడ్ గ్రౌడ్స్‌లో జరిగిన పంద్రాగస్ట్ వేడుకలు ఇప్పుడు గోల్కొండ వేదికగా ఏటేటా సాగుతున్నాయి. దీంతో ఈ యేడు కూడా పంద్రాగస్టు వేడుకలకు చారిత్రక గోల్కొండకోటను అన్ని రకాల హంగులతో ముస్తాబు చేసారు. గురువారం నిర్వహించే కార్యక్రమాలపై ఇప్పటికే రిహార్సల్స్ పూర్తయ్యాయి. భద్రత కార్యక్రమాల రిహార్సల్స్‌తోపాటు పోలీసు, వివిధ భద్రత బలగాలు కవాతు నిర్వహించాయి. విద్యాంస్థలు కూడా పలు కార్యక్రమాలపై రిహార్సల్స్ చేశారు. నిఘావర్గాల సూచనల మేరకు అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నట్టు సీనియర్ పోలీస్ అధికారులు చెప్పారు. మరోవైపు విద్యుత్‌దీప కాంతులతో వారసత్వ సంపద ధగధగలాడుతున్నది. వేడుకలు జరిగే హైదరాబాద్‌లోని గోల్కొండ కోట పరిసరాల్లో భారీగా పోలీసులను మోహరించింది. ఇందుకు పోలీసుశాఖలోని అన్ని విభాగాల సేవలను వినియోగిస్తున్నట్టు సీనియర్ అధికారులు తెలిపారు. వేడుకలకు ముఖ్యమంత్రి కాన్వాయ్ వచ్చే రూట్‌లో భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

### భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు
### ఐదేళ్ల దార్శనికతపై ప్రసంగంలో పెద్దపీట
### ప్రజలకు సందేశం ఇవ్వనున్న సిఎం కెసిఆర్

పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబవుతుండగా మరో వైపు సందర్శకుల తాకిడి కూడా పెరిగింది. భద్రత నేపథ్యంలో పోలీసు, పురావస్తుశాఖల అధికారులు భేటీ అయ్యారు. పోలీసుల సూచనలకు అనుగుణంగా పురావస్తుశాఖ అధికారులు సహకరిస్తూ, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ ఆధ్వర్యంలో గోల్కొండకోట వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. ప్రధానంగా పంద్రాగస్టు వేడుకలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెళ్లేమార్గంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రగతిభవన్ నుంచి గోల్కొండకోట కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. దారి పొడువునా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. ఆయాప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు కూడా పలుసూచనలు చేశారు. పశ్చిమ మండలం డీసీపీ స్థానిక పోలీసులతో సమావేశమై భద్రతపై అన్నిరకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇప్పటికే డిజివి మహేందర్ రెడ్డి, సిఎస్ ఎస్‌కె జోషి ప్రత్యక్షంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ట్రాఫిక్ ఆంక్షలు

గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్య దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాందేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట రోడ్డును మూసివేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. వేడుకల నేపథ్యంలో గోల్కొండ, ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, వేడుకలకు హాజరయ్యే ప్రజలు హ్యాండ్ బ్యాగ్‌లు, బ్రీఫ్‌కేసులు, కెమెరాలు, టిఫిన్స్ లాంటి వస్తువులను తీసుకుంరావద్దని ఆయన సూచించారు. ఈ రకమైన వస్తువులను వెంట తెచ్చుకుంటే వారిపై చర్యలు ఉంటాయని సీపీ తెలిపారు. వేడుకలకు హాజరయ్యే సాధారణ ప్రజలు తమ వాహనాలను హుడా పార్కు, సెవన్ టూంబ్స్ వద్ద పార్కు చేయాలి. వేడుకలు పూర్తయిన తరువాత ఏబీసీ కారు పాసు హోల్డర్స్ మాక్రై దర్వాజా, రాందేవ్‌గూడ వైపు నుంచి బయటకు వెళ్లిపోవాలి, డీ కారు పాసు హోల్డర్స్ బంజారా దర్వాజ, సెవెన్ టూంబ్స్ వైపు వెళ్లాలి. ఇ, ఎఫ్ పాస్ హోల్డర్స్ జమాల్ దర్వాజ, గోల్ఫ్ క్లబ్, సెవెన్ టూంబ్సు, సాధారణ పౌరులు ఫతే దర్వాజ, జమలై దర్వాజ వైపు నుంచి వెళ్లాలి.



### రాజ్‌భవన్ వద్ద ఆంక్షలు

గవర్నర్ రాజ్‌భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఇచ్చే తేనేటి విందు సందర్భంగా రాజ్‌భవన్ రోడ్డులో సాయంత్రం 4.30 గంటల నుంచి నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి సోమాజిగూడ రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు రోడ్డుకు రెండు వైపులా వెళ్లే సాధారణ వాహనాలు ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలి. వీవీఐపీఎస్ లైన తెలంగాణ, ఏపీ సీఎంలు, డిప్యూటీ సీఎంలు, హైకోర్టు చీఫ్ జస్టిస్, శాసన మండలి చైర్మన్లు, స్పీకర్లు, కేంద్ర మంత్రులు, రెండు రాష్ట్రాల మంత్రులు. వీరి వాహనాలు గేట్ నెం.1 నుంచి రాజ్‌భవన్‌లోకి వెళ్లి, గేట్-2 నుంచి బయటకు రావాలి. ఈ వాహనాలను రాజ్‌భవన్ లోపల పార్కు చేయాలి. పాసు కలిగిన ఇతర అతిథులు, గేట్ నెం.3 నుంచి లోపలికి వెళ్లి, లోపలే పార్కు చేయాలి. అదే గేటు నుంచి బయటకు వెళ్లాలి. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల సందర్భంగా తివోలి జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను బ్రూక్‌బండ్, ఎన్‌సీసీ జంక్షన్ వైపు మళ్లిస్తారు. ఈ ఆంక్షలు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## తానెప్పుడూ సాధారణ పౌరుడినే: కేటీఆర్

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): తానెప్పుడూ సాధారణ పౌరుడిగానే ఉంటానని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఒక సాధారణ వ్యక్తి మాదిరిగానే ట్రాఫిక్‌లో ప్రయాణించానని కేటీఆర్ ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వీఐపీల కోసం వినియోగించే బుగ్గ కార్లను నిషేధించిన తర్వాత తానెప్పుడు కూడా బుగ్గ కారును కూడా ఉపయోగించ లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రాకేశ్ వర్మ అనే వ్యక్తి కేటీఆర్‌కు ట్వీట్ చేస్తూ.. సార్ మీరు పంజాగుట్ట, బంజారాహిల్స్ మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ బాగా ఉన్న సమయాల్లో కూడా ఆ ట్రాఫిక్‌లోనే ప్రయాణించారు. మీరు ప్రయాణించిన సమయంలో ఎప్పుడు కూడా ట్రాఫిక్‌ను ఆపలేదు అని అతను ట్వీట్ చేశాడు. అందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతున్నానని రాకేశ్ వర్మ కేటీఆర్‌కు ట్వీట్ చేశాడు. రాకేశ్ ట్వీట్‌కు కేటీఆర్ పైవిధంగా బదులిచ్చారు.

## గోల్కొండ కోటలోనే తెలంగాణ విమోచన

### అధికారికంగా నిర్వహించాలన్న బిజెపి

హైదరాబాద్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): గోల్కొండ కోటలో జెండా ఎగుర వేసినట్లుగానే సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన సందర్భంగా జాతీయ జెండాను అక్కడే ఎగురవేయాలని బిజెపి డిమాండ్ చేసింది. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామగ్రామాన జాతీయ జెండాలను ఎగుర వేయాలని ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి పండిత్ దీన్‌దయాళ్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామన్నారు. తెరాస పాలనతో సామాన్యుడు అన్ని విధాలా నష్టపోయాడని, స్వలాభాపేక్షతో పాలన సాగిస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి రాగానే గారడీ మాటలతో అన్ని వర్గాల ప్రజలను మోసగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో విఫలమయిందన్నారు. రైతులకు రుణమాఫీ విడతలుగా ఇచ్చి మోసగించడంతో పాటు ఇంటికో ఉద్యోగం, లక్ష ఎకరాలకు సాగునీరు, ఎస్సీలకు మూడెకరాల భూమి, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చిట్టచివరి వరకు సామాన్యుడికి అందించే లక్ష్యంతో ప్రధాన మోదీ కృషి చేస్తున్నా రన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను కోరారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయని, విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కోరారు.

## జిల్లా కేంద్రాల్లో మంత్రుల జెండావందనం

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 32 జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జెండా ఎగురేసి వందనం స్వీకరస్తారు. అలాగే ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రభుత్వ ప్రాధాన్యాలను, విజయాలను వివరిస్తారు. ఇందుకోసం ఎవరు ఎక్కడ జెండా ఎగురేయాలన్నది ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. ఆయా జిల్లాల్లో జెండా వందనం చేసే మంత్రులు, ఇతర ప్రముఖుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా జిల్లాలు ఏర్పడంతో గందరగోళం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. 17 మంది మంత్రులకు తోడు శాసనసభాపతి, మండలి ఛైర్మన్, ప్రభుత్వ ఛీఫ్ విప్‌లు, విప్‌లు, ఇతర ప్రముఖులకు, ఉన్నతాధికారులకు జెండా ఎగురవేసే అవకాశం కల్పించింది. వీరు అమరవీరులకు నివాళి, గౌరవవందనం స్వీకరణ, జెండా వందనంతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఎంపిక చేసిన వ్యక్తులకు పురస్కారాలను పంపిణీ చేస్తారు. ఇతర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. సిద్దిపేటలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి జెండా ఆవిష్కరిస్తారు. వరంగల్ అర్బన్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు, రూరల్‌లో మండలి విప్ బి. వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరిస్తారు.

కరీంనగర్‌లో ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ జెండా ఎగురవేస్తారు. జగిత్యాలలో మంత్రి కొప్పుల ఈశ్వర్ జెండా ఎగురేస్తారు. నిర్మల్‌లో గృహనిర్మాణ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జెండా వందనంలో పాల్గొంటారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో..
# బీజేపీ గాలి మాత్రమే పనిచేసింది

- రాజకీయాలకు పనికిరాని వ్యక్తులు ఆ గాలిలోనే గెలిచారు
- ఔట్ డేటెడ్ క్యాండెట్స్‌తో ఒరిగేదేమీ లేదు
- హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారనడం ఊహాజనితమే
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గాలి మాత్రమే పనిచేసిందని, అందుకే రాజకీయాలకు పనికిరాని వారు బీజేపీ నుంచి పోటీచేసి ఎంపీగా గెలుపొందారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. పార్లమెంట్‌లో వీచిన గాలి ప్రతీసారి పనిచేయదని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఉన్నంత ఓటు బ్యాంక్ బీజేపీకి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గాలి మాత్రమే పనిచేసిందన్నారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తులు ఆ గాలిలోనే గెలిచారని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం పలుకుబడి మున్సిపల్ ఎకన్నికల్లో పనికిరాదన్నారు. ఔట్ డేటెడ్ క్యాండెట్స్ అందరూ బీజేపీలో చేరినంత మాత్రాన ఒరిగేదేవిూ లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. క్యాడర్ లేకుండా పార్టీలో నాయకులు చేరినంత మాత్రాన పార్టీ బలపడదన్నారు. బీజేపీలో టీడీపీ నేతలు చేరడం వెనుక చంద్రబాబు ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారంటూ వస్తున్న వార్తలు ఊహాజనితమే అని కొట్టిపారేశారు. తన కొడుకు సాయిన్ మేయర్ పదవి అడిగినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం అని మంత్రి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టులో వాదనలు

### పాతచట్టం మేరకు ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్న
### కొత్త చట్టంలో ఏముందో తమకు సమర్పించాలని సూచన

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): కొత్త మున్సిపల్ చట్టం ఆమోదించిన తరవాత పాతచట్టంతో మున్సిపల్ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని మైకోర్టు తెలంగాన ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. గతంలోఎన్నికల నిర్వహణకు 109 రోజుల సమయం కావాలన్న వారు ఇప్పుడు 8 రోజుల్లోనే ఎలా నిర్వహస్తారని కూడా ప్రశ్నించింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో విచారణ జరిగింది. కొత్త మున్సిపల్ చట్టాన్ని తమకు సమర్పించాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. వార్డుల విభజన ఏవిధంగా చేపట్టారో వివరించాలని పేర్కొంది.

ఎన్నికల పక్రియ గడువును ఎందుకు తగ్గించారో చెప్పాలని అడిగింది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చట్టప్రకారమే వ్యవహరించామని, వార్డుల విభజన, ఓటర్ల జాబితా సవరణ నిబంధనల ప్రకారమే జరిగిందని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. అలాగే ఎన్నికలకు సిద్దంగా ఉన్నామని వవరించింది. అయితే రాజకీయ కోణంలోనే ఈ పక్రియ చేపట్టారని, ముఖ్యంగా వార్డుల విభజన గందరగోళంగా జరిగిందని పిటిషన్ తరఫు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం వార్డుల విభజన ఏ ప్రాతిపదికన చేశారో తెలపాలని పేర్కొంది. కొత్త చట్టానికి, పాత చట్టానికి మధ్య తేడా ఏంటీ.. కొత్త చట్టంలో ఏముందో తెలుసుకోవడానికి తమకు ఆ కొత్త చట్టాన్ని పూర్తి వివరాలతో సమర్పించాలని ఆదేశించింది. ఎల్లుండి మరోసారి దీనిపై విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ వరణీయంబు మ్మౌ నటునను
నరవరుల తోసంగి నట్టి "నటరాజ"న్మున్
పరమాత్మ్న పూజించిన
పరమార్థుండైన "రాళ్లపల్లి" నిచులమున్!!

( ఆగష్టు 15 నలుడు రాళ్లపల్లి జననం)

-రాధశ్రీ
సెల్: 9494481210

## ఏటిఎం దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

### తమిళనాడు రాంజీ ముఠా పనే అని గుర్తింపు
### ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన ఎల్బీ నగర్ పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): వనస్థలిపురంలో గతంలోచోటుచేసుకున్న ఏటీఎం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. తమిళనాడుకు చెందిన రాంజీనగర్ ముఠానే ఈ దోపిడీకి పా÷-పడినట్లు గుర్తించారు. దాదాపు నాలుగు నెలల దర్యాప్తులో రాంజీముఠాను ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ సిబ్బంది దృష్టి మరల్చి దుండగులు సుమారు రూ.70 లక్షలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ చోరీకి పాల్పడింది రాంజీ ముఠా నేనని పోలీసులు తేల్చారు. దాదాపు నాలుగు నెలల పాటు గాలింపు చేపట్టి ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి దోపిడీకి ఉపయోగించిన వాహనంతో పాటు.. సుమారు 4 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మే 7వ తేదీన వనస్థలి పురంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన సెక్యురిటీ సిబ్బంది దృష్టి మరల్చి నిందితులు దోపిడీకి పాల్పడ్డారు. వాహనంలో నుంచి డబ్బుల పెట్టెను ఎత్తుకెళ్లిన నిందితులు ఆటోలో దిల్‌సుఖ్‌నగర్ చేరుకొని అక్కడ సులభ్ కాంప్లెక్స్‌లో డబ్బులను పెట్టెలో నుంచి సంచిలోకి మార్చుకుని పరారయ్యారు. దోపిడీకి పాల్పడిన ముఠా తమిళనాడుకు చెందిన రాంజీనగర్ వాసులుగా గుర్తించారు. గతంలోనూ భోపాల్ లోని ఓ ఏటీఎంలో చోరీలకు పాల్పడి 43లక్షలకు పైగా దోచుకెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుల కోసం పోలీసులు సుమారు 4 నెలల పాటు గాలించారు. తమిళనాడుతో పాటు కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోనూ గాలించారు. కానీ నిందితుల ఆచూకీ లభించలేదు. రాచకొండ పోలీసులు మాత్రం పట్టు విడవకుండా గాలించి నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

## ఐపీఎస్ ఆఫీసర్ ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఆగష్టు 14: దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని ఫరీదాబాద్‌లో విషాదం నెలకొంది.

ఫరీదాబాద్ డీసీపీ(డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు)గా సేవలందిస్తున్న విక్రమ్ కపూర్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తన సొంతింట్లో ఇవాళ ఉదయం 6 గంటలకు విక్రమ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విక్రమ్ నిజాయితీగల పోలీసు ఆఫీసర్ అని సహచరులు పేర్కొన్నారు. విక్రమ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు పోలీసులు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అశ్లీల మాధ్యమాలకు అడ్డుకట్ట వేయాలి..

నేటినిజం
గురువారం 15-8-2019

ముక్కు పచ్చలారని పసిగొడ్డును కర్కసంగా కడతేర్చిన కర్కోటకుడికి ఎట్టకేలకు 48 రోజుల విచారణ, దర్యాప్తు భూమి మీద బతికే హక్కు లేదని న్యాయస్థానం తీర్పు నిచ్చింది. నిజంగా అందరికీ ఆనందం. రాఖీ పండుగ కు ముందు కామదహనం ఎందుకో అర్ధమయ్యే రీతిలో ఆ దహనంలో ఇలాంటివారిని వేసి తగులపెట్టినా తప్పుకాదు. కానీ, వయసుతో సంబంధం లేకుండా ఆడశిశువులపై, బాలికలపై, యువతులపై, గృహిణులపై మన దేశంలో అఘాయిత్యాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. 'సంచలనాత్మక ఘటనలు' జరిగిన ప్రతిసారీ ప్రజలు ఆందోళనలు జరిపాక ప్రభుత్వాలు మేల్కొని కొత్త చట్టాలు తేవడం, ఉన్న చట్టాలను కఠినతరం చేయడం పరిపాటిగా మారింది. 2012లో దేశ రాజధానిలో ఓ విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన తర్వాత 2013లో 'నిర్భయ చట్టం' రూపొందింది. ఈ చట్టం కింద నమోదయ్యే కేసుల సంఖ్య పెరుగుతోందే తప్ప నేరాలు మాత్రం తగ్గుముఖం పట్టిన దాఖలాలు లేవు. 'జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ' నివేదిక ప్రకారం 2013 నాటికి దేశ వ్యాప్తంగా బాలికలపై అత్యాచారాలకు సంబంధించి 33,328 కేసులు విచారణ దశలో ఉండగా, కేవలం 1,611 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. తగిన సాక్ష్యాధారాలు లేక వేలాది కేసులు వీగిపోతున్నాయి. పెండింగ్ కేసుల రేటు 84.5 శాతంగాను, శిక్షల రేటు 31.5 శాతంగాను ఉంది. బాలికలపై అత్యాచారాల విషయంలో దేశం మొత్తం మీద నమోదయ్యే కేసుల్లో 14 శాతం కేసులు దిల్లీలోనే నమోదు కావడం గమనార్హం. దేశ రాజధానిలోని ఓ అంధుల పాఠశాలలో ముగ్గురు బాలికలపై లైంగిక నేరానికి పాల్పడిన ఓ బ్రిటన్ జాతీయుడిపై కేసు నమోదు కావడం విశేషం. ఇళ్లలో, మురికివాడల్లో, తమకు తెలిసిన ప్రాంతాల్లోనే బాలికలు ఎక్కువగా లైంగిక దాడులకు గురవుతున్నారు. 38.8 శాతం కేసుల్లో సమీప బంధువులే నిందితులు కావడం ఆందోళనకరం. 60.8 శాతం మేరకు అత్యాచారాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో చోటు చేసుకొంటున్నాయని, బాధితుల్లో 90 శాతం మంది తమపై జరిగిన అఘాయిత్యాల గురించి ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారని గణాంకాలు ఘోషిస్తున్నాయి.

బాలలపై లైంగిక నేరాలు పెరిగిపోవడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించి, కేసుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి, రాష్ట్రాలకు సూచించింది. 'లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ' (పోక్సో) చట్టం 2012లో అమలులోకి వచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో 'పోక్సో' చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఇటీవల పార్లమెంటు ఆమోదించింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని 'పోక్సో' చట్టంలో సవరణలు చేశారు. సాక్షులను విచారించేందుకు కోర్టుల్లో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని, బాధిత బాలలు గౌరవంగా జీవించేలా అనుకూల వాతావరణం కలిగించాలని సవరణలు చేశారు. 'పోక్సో' సవరణ చట్టంపై ప్రజానీకంలో తగిన అవగాహన కలిగించేలా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ప్రతిపాదించారు. కేసు విచారణలో ఫోరెన్సిక్, డీఎన్ఏ నివేదికలు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేయాలని, దేశ వ్యాప్తంగా వంద ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను నెలకొల్పాలని సూచించారు. కఠిన చట్టాలు అమలు చేస్తే తప్ప నేరగాళ్లలో భయం ఏర్పడదన్న భావంతో 'పోక్సో'లో ఇపుడు మరణదండనను చేర్చారు. బాలలతో నీలిచిత్రాలు తీసేవారికి, వాటిని వ్యాప్తి చేసేవారికి జైలుశిక్షలను, జరిమానాలను భారీగా పెంచాలని నిర్ణయించారు. 'పోక్సో' సవరణ చట్టం ప్రకారం నేరగాళ్లకు ఇరవై ఏళ్ల జైలుశిక్ష మొదలు మరణించే వరకూ జైలులోనే ఉండేలా జీవిత ఖైదు విధించడానికి అవకాశం ఉంటుంది. 2012లో అమలులోకి వచ్చిన 'పోక్సో' చట్టం కింద కేసుల సంఖ్య పెరుగుతున్నా, శిక్షలు పడుతున్న సందర్భాలు చాలా తక్కువ. కేవలం 9 శాతం కేసుల్లోనే శిక్షలు పడుతున్నాయి. 2016 నాటికి 'పోక్సో' చట్టం కింద 36,022 కేసులు నమోదు కాగా, దాదాపు 12వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 40 శాతం మంది బాధితులకు చట్ట సహాయం కూడా అందడం లేదు. గతంలో నమోదైన కేసులతో కలిపి, ఈ చట్టం వచ్చాక పెండింగ్ కేసుల సంఖ్య లక్ష దాటింది. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక సెల్‌ఫోన్లలో సామాజిక మాధ్యమాల్లో విహరించేవారి సంఖ్య అనూహ్యంగా పెరిగి సమాజంలో వికృత పోకడలు చోటుచేసుకొంటున్నాయి. ఫేస్‌బుక్, యూ ట్యూబ్, టిక్‌టాక్, వాట్సాప్ వంటి మాధ్యమాల్లో అశ్లీలం విశృంఖలమవుతోంది. సెల్‌ఫోన్లలోకి చొరబడే అశ్లీలాన్ని నిరోధించేందుకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఫోన్లతో నిత్యం కాలక్షేపం చేసే బాలలు, యువతలో కొంతమంది దారి తప్పుతున్నారు. ఇళ్లలో తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడం, విద్యాసంస్థల్లో నైతిక విలువలను బోధించకపోవడంతో విపరీత పరిణామాలు అనివార్యమవుతున్నాయి. సమాజంలో విస్తరిస్తున్న వికృత పోకడలకు అడ్డుకట్ట వేయనంత కాలం- ఎన్ని కఠోర చట్టాలు తెచ్చినా, కఠిన శిక్షలు వేసినా నేరాలను రూపుమాపడం అంటే ఒక విధంగా కత్తిమీద సామే..!

# సంప్రదాయానికి ప్రతీక రక్షాబంధన్

### యజ్ఞోపవీత ధరాణ కూడా ఓ ప్రత్యేకత

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): రక్షాబంధన్ కార్యక్రమం భారతీయ సంప్రదాయానికి తార్కాణంగా నిలుస్తుంది. సోదరులకు సోదరీమణులు ఆప్యాయతతో కట్టే రాఖీ మన సంప్రదాయాలకు అద్దం పడుతోంది. ప్రేమానురాగాలకు ఇది తార్కాణం. సోదరులకు రక్ష కట్టి తమకు రక్షగా ఉండాలిన సోదరీమణులు కోరకుంటారు. రక్షకట్టి స్వీటు తినిపించడం మనకు ఆచారంగా వస్తోంది. సోదర, సోదరీమణుల అనుబంధానికి చిహ్నంగా రాఖీ పండగ అద్దం పడుతుంది. అనురాగ బంధాల్ని, ప్రేమానురాగాల్ని బలోపేతం చేసే అపురూప పర్వదినం- రాఖీ పౌర్ణమి. శ్రావణ మాసంలో వచ్చే శుభకర వేడుకల్లో, రక్షాబంధనం రమణీయం. నిండు పున్నమివేళ సిరివెన్నెల కురిసే శ్రావణ పూర్ణిమనాడు, ఈ బంధనంలో మమతల మధురిమలు వెల్లివిరుస్తాయి. సామరస్య సంతోషాలు సోదర సోదరీమణుల మధ్య వ్యక్తమవుతాయి. ఉత్తర భారతంలో విశేష వ్యాప్తి చెందిన ఈ సంబరం, కాలక్రమంలో దేశమంతటా విస్తరించింది. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతలకు ఓ అందమైన ఆవిష్కరణ- రక్షాబంధనం. సోదరుడి ఆరోగ్యం, శ్రేయస్సు, సంతోషాన్ని ఆకాంక్షిస్తూ- సోదరి పవిత్ర హృదయంతో అతడి చేతికి రక్షా కంకణాన్ని ధరింపజేస్తుంది. నుదుట తిలకం దిద్ది, మంగళహారతి ఇచ్చి, మధుర పదార్థాన్ని సోదరుడికి సోదరి తినిపిస్తుంది. అమ్మ కనబరచే ఆదరణ, నాన్న కలిగించే భద్రతను ప్రస్ఫుటం చేస్తూ- సోదరి తన అనురాగాన్ని సోదరుడి పట్ల ప్రకటిస్తుంది. 'నేను ధరింపజేసే ఈ రక్ష- నీ భావి జీవితమంతటా సర్వదా అండగా ఉంటుంది' అనే భావనను వ్యక్తీకరిస్తుంది. సోదరుడి కుడిచేతికి సోదరి 'మంగళ రక్షాబంధనం' చేయాలని 'వ్రతోత్సవ చంద్రిక' గ్రంథం చెబుతోంది. ఇక ఇదేరోజు జంధ్యాల పున్నమిగా కూడా

భావిస్తున్నారు. ఉపనయనం చేసుకున్న వారు కొత్తగా యజ్ఞోపవీతాన్నా మార్చుకోవడం ఆచారంగా వస్తోంది. నూలుతో వడికిన జంధ్యాలను ఈ రోజు ధరించడం ప్రత్యేకత. ఈ పౌర్ణమినే రక్షా పౌర్ణమి, జంధ్యాల పున్నమి, రాఖీ పూర్ణిమ, నూలు పున్నమి, నారికేళ పున్నమిగా వ్యవహరిస్తారు. శ్రావణమాసంలో అనేక పర్వదినాలు వస్తుంటాయి. విష్ణుమూర్తి జన్మనక్షత్రం శ్రవణం. ఈ నక్షత్రం చంద్రునితో కూడిన మాసం కావడంతో శ్రావణమాసం అంటారు. ఈ మాసంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. ఆకాశం మబ్బులతో వెండికొండలను తలపిస్తుంటుంది. పూర్వకాలం వేద అధ్యయనం శ్రావణమాసంలోనే ప్రారంభమయ్యేది. విష్ణుపురాణంలో రక్షాబంధన్ గురించి వివరించారు. బలి చక్రవర్తిని విష్ణుమూర్తి దేవతల కోరిక మేరకు బంధిస్తాడు. అయితే ఈ బంధం అతనికి రక్షణగా నిలుస్తుందని వరమిచ్చినట్టు తెలుస్తోంది. పాల్కురికి సోమనాథుడు ఈ పౌర్ణమిని నూలి పున్నమిగా అభివర్ణించాడు. కర్ణాటకలో నారికేళ పున్నమిగా పండగ నిర్వహిస్తారు. పాండవులకు జయం సిద్ధించడానికి శ్రీకృష్ణుడు ఓ సూచన చేస్తాడు. ఆ మేరకు ధర్మరాజు తన సోదరులకు మంత్రపూర్వకంగా రక్షాబంధన మహోత్సవం నిర్వహించాడని 'మహాభారతం' చెబుతుంది. సోదరీమణులతో రక్షాబంధనం ధరింపజేసుకున్నవారికి యమకింకరుల భయం ఎన్నటికీ ఉండదని- యముడు తనసోదరి యమునకు చెప్పినట్లు 'భవిష్యోత్తర పురాణం' పేర్కొంది. దానశీలుడైన బలి చక్రవర్తికి శ్రీమహావిష్ణువు తన శక్తిని ఓ కంకణంలో నిక్షిప్తం చేయడం ద్వారా 'రక్ష'గాఅందజేశాడని 'విష్ణుపురాణం' విశదపరచింది. శత్రుభయం లేకుండా తన సుపుత్రుడు అఖండ పాలనసాగించాలని ఆకాంక్షిస్తూ, భరతుడికి తల్లి శకుంతల రక్ష కట్టిందని పురాణ కథనం.

# బిజెపిలో చేరుతానంటున్న నటి రేవతి

న్యూఢిల్లీ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు తెలుగు సినీ నటి, టీడీపీ నేత రేవతి

చౌదరి తెలిపారు. ఆమె ఈరోజు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఢిల్లీలో కలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను త్వరలోనే కాషాయ కండువా కప్పుకోనున్నట్లు వెల్లడించారు. గత ఎన్నికల ముందు రేవతి చౌదరి తెలుగు దేశం పార్టీలో చేరారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్వయంగా కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అంతే కాకుండా ఆమెకు టీడీపీ అధికార ప్రతినిధిగా అవకాశం ఇచ్చారు. రాజకీయాల్లోకి రాకముందే వెండితెర ద్వారా తెలుగువారికి రేవతి సుపరిచితం. పలు తెలుగు సినిమాల్లో ఆమె నటించారు.

# పటిష్ట భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి

హైదరాబాద్, ఆగష్టు 14:దేశం స్వాతంత్ర్యం సాధించుకుని గర్వంగా 72 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో పాలకులు తమ విధానాల్లో,ఆలోచనల్లో మార్పులతో ముందుకు సాగాలి. పటిష్ట భారత నిర్మాణానికి కంకణబద్దులు కావాలి. సరిహద్దుల్లో ఉగ్రమూకలను గట్టిగా అణచివేస్తూ ముందుకు సాగాలి. ఓ చారిత్రక నిర్ణయంగా 370 ఆర్టికల్ రద్దుపై తీసుకున్న నిర్ణయంతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్న తరుణంలో ప్రజలు, ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి అండగా నిలవాలి. విపక్షాలు ఇక కాశ్మీర్‌పై విమర్శలు కట్టిపెట్టాలి. కలసికట్టుగా ముందుకు సాగాలి. ఈ స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేకత ఉంది. కాశ్మీర్ ఇప్పుడు ఉపూర్తిగా భారత్‌లో భాగస్వామ్యమై కొత్తగా పంద్రాగస్ట్ వేడుకలను జరుపుకుంటోంది. గతంలో ఎన్నోమార్లు అక్కడ త్రివర్ణ పతకాం ఎగురేయాలన్న డిమాండ్‌కు అడ్డంకులు ఉండేవి. లాల్‌చౌక్‌లో జెండా ఎగురవేయడం నేరమైనట్లుగా గతంలో చూశాం. ఇప్పుడు ప్రజలు స్వేఛ్ఛా స్వాంత్ర్యాలను పీల్చుకుని సగర్వంగా కలసి ముందుకు సాగనున్నారు. ఇకపోతే దేశం విభజననాటినుంచి పాక్ కుతంత్రాలకు కేంద్రంగా ఉంటూ అక్కడి ప్రజలను ఎదగనీయకుండా సైన్యం పడగనీడలో కొనసాగుతోంది. విడిపోయిన వారు శత్రువులుగా మారారు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవపరం ఉంది. జెండా ఎగుర వేయడమే గాకుండా ప్రజల కోసం పరితపించేలా పాలన సాగిస్తామని ప్రతిన చేయాల్సిన సమయమిది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఈ 72 ఏళ్ల వైఫల్యాలపై పాలకులు ఆత్మపరిశీలన చేసుకునే సమయమిదే. రాజకీయాల ను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సిన సమయమిది. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయా న్ని పాలకులు వంటబట్టించుకోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ 70 ఏళ్ల తరవాత కూడా ఇంకా దారిద్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నోట్ల రద్దు తరవాత అనేక కష్టాలు పడుతున్నారు. మోడీరాకతో ప్రజల్లో చిగురించిన ఆశలు వమ్మయ్యాయి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్య రంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నావెూ ఆలోచన చేయాలి. వివిధ రంగాలపై అదిచూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం ప్రజల కోణంలో ఆలోచించాలి. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉల్లిపాయల ధర మరోమారు 30రూపాయలకు చేరుకుంది. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్ల డబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు

చేస్తున్న వైనం తాజా ఎన్నికల్లో సైతం చూస్తున్నాం. ఈ డబ్బుకు లెక్క ఉందో లేదో చెప్పాలి. ఇలా రాజకీయ పార్టీలకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చువుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 72 ఏళ్లలో నిరూపితం అయ్యింది. ఆ క్రమంలోనే ఖర్చు వందలు, వేల కోట్ల రూపాయలకు చేరిపోయింది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయరంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహారధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో శ్రద్ధ చూపడం లేదు. ఈ దశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగి తే మరో వందేళ్లయినా మన భారత్ రాత మారదు. రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. అప్పుడే ప్రజలకు స్వాతంత్ర్య ఫలం దక్కుతుంది. అప్పుడే భారత్ ఉజ్వలంగా వెలుగుతుంది. అందుకు పూనుకోకుంటే ప్రజల్లో ఉన్న అసంతృప్తి రాజకీయ పార్టీలను దహించివేయ కతప్పదు.

# అవినీతిరహిత పాలనకు పెద్దపీట

## సత్తాచాటే నిర్ణయాలు తీసుకున్న మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట్14 (ఆంఎన్ఎ): మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత ఐదేళ్ల పాలన అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకున్న సత్తా చాటింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. ట్రిపుల్ తలాక్‌కుమంగళం పాడడంతో ముస్లిం మహిళలకు వివాహ బంధం విషయంలో భరోసా దక్కింది. అలాగే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు కూడా సాహసోపేత నిర్ణయంగా నిలిచి పోనుంది. మోడీ సర్కార్ సామస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ చేసి దాయాదిదేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. అలాగే అవినీతి మరక అంటకుండా మోడీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నాయి. గత ఐదేళుగా తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోడీ జాగ్రత్తగా వ్యవహరించారు. ఎక్కడా ఒక కుంభకోణంఅన్నది లేకుండా పాలన సాగిస్తున్న తీరు ప్రజలనుంచి అభినందనలు వస్తున్నాయి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇది బిజెపికి విజయంగానే చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టకోలేం. భారతీయ జనతా పార్టీ విస్తరణ కాంక్ష మోడీ, షాలను నిలవనివ్వడం లేదు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! ఈ కారణంగానే ఇప్పుడు దక్షిణాదిపై దృష్టి పెట్టారు. తమిళనాడులో పళనిస్వామి ప్రభుత్వాన్ని బుట్టలో వేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోడీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తల్లీకూతుళ్ల మృతి

రంగారెడ్డి,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): రంగారెడ్డి జిల్లాలో శంకర్‌పల్లి మండలం ఎల్వర్తి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తల్లీకూతుళ్లు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు.

స్థానికులు వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక

నుంచి కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులు తల్లి స్వప్న(38), కూతురు సహస్ర(10)గా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# స్వాతంత్ర్య వేళ ముంపులో అనేక రాష్ట్రాలు

### అంటువ్యాధుల భయంతో ప్రజల్లో ఆందోళన
### తక్షణ సాయం అందించాల్సిన అవసరం ఇది
### నదుల్లో జలకళతో ప్రాజెక్టులకు భారీగా నీరు

న్యూఢిల్లీ,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): దేశం స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న వేళ అనేక రాష్ట్రాలు జలదిగ్బంధంలో మునిగి ఉన్నాయి. భారీ వర్షాలు మహారాష్ట్ర, కర్నాటక, కేరళలను అతలాకుతలం చేశాయి. అలాగే ఉత్తరాది రాష్ట్రాలు గుజరాత్, హిమాచల్,అసోం తదితర రాష్ట్రాలను కూడా కుదిపాయి. ఇప్పటికే నీటిలోనే ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇంకా వరదల భయం వీడలేదు. అనేకమంది మృత్యువాత పడ్డారు. నిత్యావసరాల కోసం అనేకులు ఎదురు చూస్తున్నారు. అంటువ్యాధులు పొంచివున్నాయి. ఈ సమస్యలపై ప్రధానంగా ఇప్పుడు దృష్టి సారించాలి. ఇకపోతే నదుల అనుసంధానం గురించి మాట్లాడుతున్న మనం వరదల గురించి కూడా మాట్లాడుకుని, వాటి నివారణకు పూనుకోవాలి. పాలకులు ఈ దిశగా వరదలకుకారణాలను అన్వేషించాలి. ప్రకృతి విధ్వంసం కారణంగా అకాల వరదలుపోటెత్తాయి. మళ్ల ఈనీరంతా సముద్రంలో కలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దం తర్వాత కృష్ణా, గోదావరి, వంశధార నదులు పోటాపోటీగా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో నదీ పరీవాహక ప్రాంతంలో ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. కృష్ణా,గోదావరిల నుంచి నీరంతా సమదుద్రం పాలయ్యింది. నీటినిల్వకు అనువైన ప్రాజెక్టులు లేకపోవడం, పోలవరం పూర్తి కాకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అలాగే తెలంగాణలో శ్రీరాంసగర్, మంజీరాల్లోకి నీరు ఇంకా రాలేదు. హైదరాబాద్ జంట జలాశయాల్లోకి కూడా నీరు చేరలేదు. కృష్ణా, వంశధార నదుల్లో సెప్టెంబరు వరకూ.. గోదావరి నదిలో అక్టోబర్ వరకూ వరద ప్రవాహం ఉంటుంది. రుతుపవనాల వల్ల సమృద్ధిగా వర్షాలు కురిస్తే పెన్నా నది కూడా పొంగుతుంది. వర్షాలు ఇలాగే కొనసాగితే మధ్య తరహా ప్రాజెక్టులు సైతం నిండుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 2009 తర్వాత జీవనదులు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకోవడంతో ప్రాజెక్టుల కింద ఆయకట్టులో ఖరీఫ్, రబీ పంటల సాగుకు అవకాశం ఏర్పడిందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఇప్పటికే గోదావరి డెల్టాలో 10.13 లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేశారు. కృష్ణా డెల్టాలో 13.09 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేశారు. వంశధార నది పోటెత్తుతుండటంతో గొట్టా బ్యారేజీ నుంచి 2.31 లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేశారు. ఉత్తరాంధ్రలో నాగావళి నది ఉధృతంగా ప్రవహించడంతో తోటపల్లి జలాశయం నిండిపోయింది. . నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ కింద 11.74 లక్షల ఎకరాలకు, ఎడమ కాలువ కింద ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని 10.38 లక్షల ఎకరాలకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్, తెలంగాణ మంత్రి జగదీష్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు ఆగస్టు రెండో వారంలోగా నీటిని విడుదల చేయడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కృష్ణా, తుంగభద్ర నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడం, ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తుండడంతో రాయలసీమ, నెల్లూరు జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేస్తున్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కింద కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల్లో 4.36 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టులో పంటల సాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు.తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా సోమశిల, కండలేరు జలాశయాలను నింపనున్నారు. దీనివల్ల పెన్నా డెల్టా పరిధిలోని 2.47 లక్షల ఎకరాలు, సోమశిల ప్రాజెక్టు కింద 1.56 లక్షల ఎకరాలకు నీళ్లందించడానికి ప్రణాళిక రచించారు. తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతుండడంతో ఇప్పటికే తుంగభద్ర జలాశయం నిండిపోయింది. ఈ ఏడాది తుంగభద్రలో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉంది. చిన్న తరహా ప్రాజెక్టులు, చెరువులు కొంతవరకు నిండాయి. నీటి లభ్యత ఆధారంగా వాటి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# వందో స్వాతంత్ర్య వేడుకల నాటికి కశ్మీర్ ఉండదు

### వైగో సంచలన వ్యాఖ్య

చెన్నై,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దుపై ఎండీఎంకే చీఫ్, ఎంపీ వైగో మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతదేశం వందవ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకునే నాటికి కశ్మీర్ భారత్‌లో భాగంగా ఉండదని ఆయన జోస్యం చెప్పారు. మంగళవారం ఆయన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. భారత్ వందవ స్వాతంత్య్ర దినోత్సవం జరుగుపుకునే సమయానికి భారత్‌లో కశ్మీర్ భాగంగా ఉండదు. బీజేపీ ప్రభుత్వం కశ్మీర్‌పై బురద చల్లింది. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ కశ్మీర్‌కు 30 శాతం అన్యాయం చేస్తే.. బీజేపీ 70 శాతం చేసింది. కశ్మీర్‌పై గతంలో కూడా నా అభిప్రాయం ఇదే విధంగా చెప్పానని అన్నారు. కాగా కశ్మీర్ విభజన సందర్భంగా పార్లమెంట్‌లో వైగో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం చారిత్రాత్మక తప్పిందం చేసిందని తీవ్ర స్థాయిలో విమర్శించిన విషయం తెలిసిందే.

# కీలక మలుపులో యువకుడి ఆత్మహత్య కేసు విచారణ

### బయటపడ్డ ప్రియురాలు అత్యాచార వ్యవహారం
### దుండగులను అరెస్ట్ చేసిన పోలీసులు

జైపూర్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లో చోటుచేసుకున్న సూసైడ్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో ఒళ్లుగగుర్పొడిచే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. యువకుడి ఆత్మహత్య దర్యాప్తులో సామూహిక అత్యాచార కేసు బయటపడింది. ఉదయ్‌పూర్‌కు చెందిన ఓ యువకుడు జులై 14న ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మృతుడు మొబైల్‌ను ఓ మహిళ వినియోగిస్తున్నదని వారు తెలుసుకున్నారు. ఇది నీకు ఎక్కడి నుంచి వచ్చిందని సదరు మహిళను ప్రశ్నించగా.. తన భర్త జితేంద్ర ఇచ్చాడని ఆమె బదులిచ్చింది. దీంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈలోపు కాల్ డేటా పరిశీలించగా..మృతుడికి జులై 13న అతడి గర్ల్‌ఫ్రెండ్(19) నుంచి పలుమార్లు కాల్స్ వచ్చినట్లు బయటపడింది. ఈ దిశగా కేసును పరిశోధించగా..ఆ యువతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, దాంతో గత 15 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది. అసలేం జరిగిందని ఆ యువతిని ప్రశ్నించిన పోలీసులకు దిమ్మతిరిగే వాస్తవాలు తెలిశాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. జులై 13న రాత్రి 10 గంటలకు ఆమె ప్రియుడితో కలిసి బైక్‌పై తన ఇంటికి తిరిగి వెళుతుండగా సునీల్, వికాశ్, జితేంద్రలు వాళ్లను అడ్డగించారు. యువకుడిని ఇనుప రాడ్లతో కొట్టి..అతడి దగ్గర నుంచి సెల్‌ఫోన్ లాక్కుని బలవంతంగా అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం సదరు యువతిని ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమె అప్పటికే రెండు నెలల గర్భిణి. ఈ విషయం వారికి చెప్పి.. విడిచిపెట్టమని ప్రాధేయపడినా వాళ్లు కనికరించలేదు. ఆ తరువాత అక్కడి నుంచి మరో ప్రాంతానికి ఆమెను తరలించారు. మరో ఇద్దరు స్నేహితులను కూడా అక్కడికి పిలిపించారు. ఐదుగురూ మళ్లీ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను రోడ్డు మీద వదిలేసి నిందుతులు పారిపోయారు. ఈ దారుణం కారణంగా ఆమెకు గర్భస్రావం కావడంతో గత 15 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అయితే ఈ విషయం నలుగురికీ తెలిస్తే పరువు పోతుందని భావించిన యువతి జరిగిన దారుణం గురించి ఎవ్వరికీ చెప్పలేదు. మరోవైపు తన గర్ల్‌ఫ్రెండ్‌ను కాపాడ లేకపోయానని కుమిలిపోయిన యువకుడు చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ దారుణానికి పాల్పడిన సునీల్, వికాస్, జితేంద్ర, నరేశ్, విజయ్‌లను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.

# బెంగుళూరులో విషాద ఘటన

### కుటుంబాన్ని బలితీసుకున్న భర్త వివాహేతర సంబంధం

బెంగళూరు,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): భర్త వివాహేతర సంబంధం భార్య, పిల్లల ప్రాణాలు తీసింది. ఈ సంఘటన దక్షిణ బెంగళూరులోని హనుమంతనగర్‌లో చోటుచేసుకుంది. ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్న ఓ వ్యక్తి వివాహేతర సంబంధంకొనసాగించడంతో ఇంట్లో తరచూ గొడవులు అయ్యేవి. భర్త తీరుపై భార్య పలుమార్లు నిలదీసినా లాభం లేకపోవడంతో పిల్లలతో కలసి ఉరేసుకుని తనువు చాలించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధయ్య అనే వ్యక్తి 18 సంవత్సరాల క్రితం రాజేశ్వరిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు మానష(17), భూమిక (15) కూతుళ్లు ఉన్నారు. సిద్ధయ్య బెస్కమ్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత మూడు సంవత్సరాల నుంచి సిద్ధయ్య మరోక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన కుటుంబాన్ని పట్టించుకోవడంలేదు. దీంతో కుటుంబంలో పలుమార్లు గొడవలు జరిగాయి. ఇరు కుటుంబాల పెద్దలు సిద్ధయ్యకు భార్య, పిల్లలను మంచి చెడులు చూసుకోవాలని సూచించారు. అలా పలువార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినప్పటికి అతడిలో మార్పు రాలేదు. దీంతో తల్లీ కూతుళ్లు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రాజేశ్వరీ తలిదండ్రులు పలుమార్లు ఫోన్ చేసినప్పటికి సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి దగ్గర తలుపుతట్టారు. కిటికీలో నుంచి చూడగా ముగ్గురు ఉరేసుకొని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని తలుపులను బద్దలుకొట్టారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. డిసిపి రోహిణి కటోచ్ సెపత్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని చెప్పారు.

# ఔను..కల్వకుంట్ల ప్రభుత్వమేనడుస్తోంది

### అక్కడ మోడీ ప్రభుత్వం అంటున్నారు కదా: తలసాని

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కల్వకుంట్ల వారి ప్రభుత్వం నడుస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ సోమవారం చేసిన విమర్శలపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అని అంటున్నారు కదా.. అలాగే తెలంగాణలో కూడా కల్వకుంట్ల వారి ప్రభుత్వమే నడుస్తోందన్నారు. అయినా ఆ సందేహం లక్ష్మణ్‌కు ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీతో కలిసిపోతున్నారంటూ తెరాసపై విమర్శలు చేయడమెందుకు? పాతబస్తీలో భాజపా బలోపేతానికి ఎంఐఎంతో మీరే కలిసి వెళ్లొచ్చు కదా అని అన్నారు. పుల్వామా ఘటన జరిగినప్పుడు ఎంఐఎం నేతలు మోదీకి మద్దతు తెలిపారు. 2018లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా 119 స్థానాల్లో పోటీచేస్తే 113 స్థానాల్లో డిపాజిట్లు కూడా రాలేదు. వేరే పార్టీల వాళ్లు అంటరానివాళ్లు అనే భావన మాకు లేదు. దేశంలో ఏ పార్టీ వారు వసతి గృహాల్లో సన్నబియ్యం పెట్టాలని ఎవరైనా అడిగారా? మేమే చేశాం కదా! ఏ ప్రభుత్వమైనా రూ.20లక్షల ఉపకార వేతనంతో విద్యార్థులను విదేశాలకు పంపాయా? అప్పులు చేశారు అంటున్నారు.. ఎవరి కోసం అప్పులు చేశాం? కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం నడుస్తోంది గనకే ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టగలుగుతున్నాం. మీరు దిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి జాతీయ ప్రాజెక్టులు, నిధులు రాష్ట్రానికి తీసుకొస్తే ప్రజలు మిమ్మల్ని ప్రశంసిస్తారు కదా అని తలసాని వ్యాఖ్యానించారు.

# అయోధ్యలో ఐదోరోజూ కొనసాగిన విచారణలు

### కూల్చివేత అంశంపై ధర్మాసనం చర్చ

న్యూఢిల్లీ,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): అయోధ్య రామజన్మ భూమి వివాదంపై సుప్రీంకోర్టు ఐదో రోజు విచారణ మంగళవారం జరిగింది. వివాద స్థలంలో మొదట రామాలయం ఉండేదా? ఆ తర్వాత దానిపై మసీదు నిర్మించారా? అనే అంశాలపై వాదనలు వినిపించారు. రామ్ లల్లా విరాజ్‌మాన్ తరపున వాదనలను సీనియర్ అడ్వకేట్ సీ ఎస్ వైద్యనాథన్ వినిపించారు. రామాలయంపై మసీదును నిర్మించారా? అనే అంశంపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి వాదనలు వినిపించారు. ఈ ధర్మాసనంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ ఏ బాబ్డే, జస్టిస్ డీ వై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ ఏ నజీర్ ఉన్నారు. సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ మాట్లాడుతూ అలహాబాద్ హైకోర్టు తీర్పును ప్రస్తావించారు. వివాద స్థలంలో రామాలయం ఉండేదని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు చెప్పిందన్నారు. రామాలయం శిథిలాలపై మసీదును నిర్మించారని ఈ త్రిసభ్య ధర్మాసనంలోని జస్టిస్ ఎస్ యూ ఖాన్ చెప్పారన్నారు. రామ్ లల్లా విరాజ్‌మాన్ తరపున హాజరైన మరొక సీనియర్ న్యాయవాది కే పరాశరన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తన సమక్షంలో ఉన్న అన్ని అంశాలపైనా పరిపూర్ణ న్యాయం చేయాలని కోరారు. రామజన్మభూమి వివాదంపై అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. 4 సివిల్ దావాలపై విచారణ అనంతరం ఇచ్చిన తీర్పులో 2.77 ఎకరాల స్థలాన్ని ఈ కేసులో పార్టీలైన సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్ లల్లా విరాజ్‌మాన్‌లకు సమానంగా పంచింది. దీనిపై సుప్రీంకోర్టులో 14 అపీళ్ళు దాఖలయ్యాయి. వీటిపైనే ఈ నెల 6 నుంచి రోజువారీ విచారణ జరుగుతోంది.

# రివర్స్ టెండరింగ్‌పై పునరాలోచించాలి

### పోలవరం అథారిటీ సూచన

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ముగిసింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం రివర్స్ టెండరింగ్ సరికాదని పోలవరం అథారిటీ అభిప్రాయపడింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రివర్స్ టెండరింగ్‌కు వెళ్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. మంగళవారం ఇక్కడి సిడబ్ల్యూసీ భవన్‌లో పోలవరం అథారిటీ సమావేశమైంది. రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టు పూర్తి చేసే సమయం మీద తీవ్ర ప్రభావం చూపతుందని పోలవరం అథారిటీ అభిప్రాయపడింది. కాంట్రాక్ట్ ఏజెన్సీల పనితీరు సంతృప్తికరంగానే ఉందని పోలవరం అథారిటీ పేర్కొంది. రివర్స్ టెండరింగ్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని సూచించింది. ఇదిలాఉండగా, ఈ భేటీలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు తీరుపై సమీక్షించామని పోలవరం ఆర్అండ్ఆర్ ప్రత్యేక అధికారి రేఖారాణి తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సవరించిన అంచనాల ప్రకారం రూ.32వేల కోట్లు అవసరం ఉందని తెలిపారు. ప్రజల నుంచి ఏవైనా అభ్యర్థనలు వస్తే పరిశీలిస్తామన్నారు. అదేవిధంగా పోలవరం వరదలపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ముంపు బాధితులకు మెరుగైన రీతిలో పునరావాసం కల్పిస్తామన్నారు.

### టిఆర్ఎస్,బిజెపిలు తోక పార్టీలు: మల్లు

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): భాజపా నేతలు కాంగ్రెస్‌పై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు భాజపా నాయకుల మాయమాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. భాజపాకు సమర్థమైన నాయకులు, కార్యకర్తలు లేరని.. అందుకే ఇతర పార్టీల వారిని చేర్చుకుంటున్నారని దుయ్యబట్టారు. భాజపాలో చేరికలన్నీ తాత్కాలికమేనన్నారు. కేంద్రంలో భాజపాకు తెరాస.. రాష్ట్రంలో తెరాసకు భాజపా తోక పార్టీలని మల్లు రవి ఎద్దేవా చేశారు.

# మహాభారతం తెలుసుకో రజనీ

### కృష్ణార్జునుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపాటు

చెన్నై,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కశ్మీర్‌పై కేంద్రం నిర్ణయాన్ని ప్రశంసిస్తూ తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కృష్ణార్జునులతో పోల్చడంపై కాంగ్రెస్ మండిపడింది. రజనీ నుంచి ఇలాంటి వ్యాఖ్యలు ఊహించలేదని, ఆయన తీరు విస్మయానికి గురిచేసిందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి అన్నారు. ఈశాన్య రాష్ట్రాలకున్న ప్రత్యేక ప్రతిపత్తిని మాత్రం కేంద్రం ఎందుకు తొలగించట్లేదో తెలుసుకోవాలనుకుంటున్నానని అళగిరి వ్యాఖ్యానించారు. ముస్లింల సంఖ్య ఎక్కువగా ఉందనే కారణంగానే జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశారని ఆరోపించారు. ఇలాంటి ద్వంద్వ నీతిని రజనీకాంత్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. కోట్లాది మంది హక్కులను హరించిన మోదీ, అమిత్ షా కృష్ణార్జునులు ఎలా అవుతారన్నారు. మరోసారి మహాభారతాన్ని చదివి అందులోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని అళగిరి వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీర్‌కు 370 రద్దు చేయడంపై రజనీకాంత్ చెన్నైలో జరిగిన ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాసిన 'లిజనింగ్.. లెర్నింగ్..లీడింగ్' పుస్తకావిష్కరణ సభలో స్పందించారు. 'మిషన్ కశ్మీర్ విజయవంతమైనందుకు హృదయపూర్వక అభినందనలు. పార్లమెంటులో అమిత్‌షా ప్రసంగం అద్భుతం. అమిత్ షా-మోదీ ఇద్దరూ కృష్ణార్జునుల వంటి వారు. ఎవరు కృష్ణుడు, ఎవరు అర్జునుడు అన్నది మాత్రం వారికే తెలుసు' అని రజనీకాంత్ వ్యాఖ్యానించారు.

# పిట్లం మండల కేంద్రంలో నిర్బంధ తనిఖీలు

### అనుమతి పత్రాలు లేని వాహనాలు సీజ్

కామారెడ్డి,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): నేరాల నియంత్రణకు నిర్బంధ తనిఖీలు చేపడతున్నామని జిల్లా ఎస్పీ శ్వేత అన్నారు. పిట్లం మండల కేంద్రంలో జిల్లా పోలీసులు మంగళవారం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గ్రామీణులను ఉద్దేశించి మాట్లాడారు. అనుకోకుండా జరిగే సంఘటనలతో ప్రజలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పోలీసులు అండగా ఉన్నారన్న భరోసాను ప్రజలు మరిచిపోవద్దని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమీపంలోని పోలీసులకు అప్పగించాలని కోరారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని 150 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ టాటాబాబు, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

# జూరాల నీటితో నీట మునిగిన ఆలయాలు

మహబూబ్‌నగర్,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): లక్షల క్యూసెక్కుల నీరు జూరాల నుంచి దిగువకు వస్తుండడంతో బీచ్‌పల్లిలోని ఆలయాలు నీటమునిగాయి. బీచ్‌పల్లి దేవాలయం జాతీయ రహదారి 44పై ఉంది. ఇక్కడ శివాలయం రెండు రోజుల క్రితమే పూర్తిగా నీట మునిగింది. అలాగే పక్కన ఉన్న రామాలయంలో కూడా నీరు ప్రవేశించింది. దీంతో పూజా కార్యక్రమాలు నిలిచిపోయాయి. కాగా 30 అడుగుల లోపల కృష్ణ పుష్కర ఘాట్‌లు ఉన్నాయి. ఆ ఘాట్లు కూడా నీట మునిగిపోయాయి. 'బీభత్సమైన ప్రవాహం 2009లో చూశాము. మళ్లీ ఇప్పుడే చూస్తున్నాం'. ఆలమట్టి నుంచి దాదాపు 5 లక్షల 50వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోంది. అలాగే 5 లక్షల 60వేల క్యూసెక్కుల నీరు నారాయణపూర్ డ్యామ్ నుంచి దిగువగు వస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ కొండపేట, అత్తాపూర్, రాంపూర్ గ్రామాలు నీట మునిగాయి. పంట పొలాలు కూడా పూర్తిగా నీటమునిగాయి.

# కొప్పుల ఛైర్మన్‌గా గిరిజన సలహామండలి

హైదరాబాద్,ఆగస్టు14 (ఆంఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర గిరిజన సలహా మండలి ఏర్పాటైంది. గిరిజన సలహా మండలి ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. మంత్రి కొప్పుల ఈశ్ర్ ఛైర్మన్‌గా ఇది ఏర్పడింది. మొత్తం 20 మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. ఛైర్మన్‌గా రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. అధికార సభ్యులుగా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంచాలకులు, రాష్ట్ర గిరిజన సాంస్కృతిక, పరిశోధనా, శిక్షణా సంస్థ సంచాలకులు, గిరిజన ఎంపీ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ, 12 మంది ఎమ్మెల్యేలు ఉంటారు.

### తలస్నానం చేస్తున్నారని..

# బాలికల జుట్టు కత్తిరించిన ప్రిన్సిపల్

### - మెదక్‌లోని ఎస్సీ, ఎస్టీ గురుకుల హాస్టల్‌లో ఘటన
### - విచారణకు ఆదేశించిన కలెక్టర్

సంగారెడ్డి ఆగస్టు14 (నేటినిజం ప్రతినిధి) : గురుకుల హాస్టల్లో అనాగరిక ఘటన చోటుచేసుకుంది. హాస్టల్లో ఉన్న బాలికల జుట్టును ప్రిన్సిపల్ కట్‌చేయించింది. రోజు తల స్నానంచేస్తున్నారని 180 మంది బాలికల జుట్టు కత్తిరించిన ఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటన మెదక్‌లోని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గురుకుల పాఠశాలలో బాలికలు విద్యనభ్యసి స్తున్నారు. ఇక్కడ కొంత నీటి కొరత ఉండటంతో, అరకొర నీటితో మాత్రమే స్నానాలు, ఇతర కార్యకలాపాలకు బాలికలు వినియోగి స్తున్నారు. కాగా బాలికలు ప్రతీరోజూ తలస్నానం చేస్తున్నా రని, దీంతో నీరు సరిపోవడం లేదని ప్రిన్సిపల్ అరుణ భావించి.. హాస్టల్‌లోని 180 మంది బాలికల జుట్టును కత్తిరించారు. అంతేకా కుండా ఈ విషయం గురించి వారి తల్లిదండ్రులకు చెప్పవద్దని, బైటివారికి గానీ చెప్పవద్దంటూ బాలికలను ప్రిన్సిపల్ బెదిరించింది. కాగా పలువురు విద్యార్థులు ఈ విషయాన్నివారి తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో హాస్టల్‌లోకు వచ్చిన బాలికల తల్లిదండ్రులు ఘటనపై ప్రిన్సిపల్‌ను నిలదీశారు. దీంతో ప్రిన్సిపల్ చెప్పిన కారణంతో వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. హాస్టల్ లో నీటి కొరత ఉందని, బాలికలు రోజు తలస్నానం చేస్తుండటంతో నీటి ఇబ్బందులు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. అందుకే బాలికల జుట్టు కత్తిరించానని ప్రిన్సిపల్ అరుణ చెప్పింది. అంతటితో ఆగకుండా బాలికల తల్లిదండ్రులపైనా అరుణ విరుచుకుపడింది. ఇక్కడి నీటి కష్టాల గురించి మీకేం తెలుసు? వెళ్లండి వెళ్లండి అంటు విరుచుకుపడటంతో వారు వెళ్లిపోయారు. కాగా ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ప్రిన్సిపల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.. దీనిపై విచారణకు ఆదేశించారు.

# పసికందును అమ్మకానికి పెట్టిన తల్లి

### - వరంగల్ పట్టణంలో అమానుష ఘటన
### - భర్తపై కోపంతో పసికందు విక్రయానికి పాల్పడ్డ మహిళ
### - పోలీసులకు పట్టించిన స్థానికులు

వరంగల్, ఆగస్టు14(నేటనిజం ప్రతినిధి) : వరంగల్ జిల్లాలో అమానుషం చోటుచేసుకుంది. 7నెలల ఆడబిడ్డను రూ.1000కి అమ్మాకానికి పెట్టింది ఓ తల్లి. కాగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా పెంబర్తికి చెందిన దంపతులు జ్వరంతో బాధపడుతున్న 7నెలల ఆడబిడ్డను మంగళవారం వరంగల్ ఎంజీఎంకు తీసుకొచ్చారు. అక్కడికొచ్చాక దంపతులిద్దరికీ గొడవ జరిగింది. దీంతో భర్త ఆమెను వదిలి వెళ్లిపోయాడు. భర్తపై చిర్రెత్తుకొచ్చిన మహిళ తన ఆడబిడ్డను వరంగల్ బస్టాండ్‌కు తీసుకెళ్లి అమ్మకానికి పెట్టింది. రూ.వెయ్యి తన బిడ్డను ఇచ్చేస్తానని కొందరికి చెప్పింది.

మహిళ ప్రవర్తనపై అనుమానం వచ్చిన ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మహిళను ప్రశ్నించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో చిన్నారిని శిశు సంక్షేమ శాఖాధికారులకు అప్పగించారు. మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా భర్తపై కోపంతో నవమాసాలు మోసి కన్న బిడ్డను అమ్మకానికి పెట్టినట్లు పోలీసులకు తెలిపింది. దీంతో మహిళ తీరుపై స్థానికులు మండిపడ్డారు.

# సాగర్‌వైపు కృష్ణమ్మ పరుగులు

నాగర్‌కర్నూల్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్‌కు కృష్ణా జలాలు పరుగులు పెడుతున్నాయి. మొత్తం పది గేట్ల ద్వారా 7,75,600 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 183 టీఎంసీలు. ప్రాజెక్ట్ లోతు 885 అడుగులు. కాగా, ప్రస్తుత నీటి మట్టం 879 అడుగులు. అదేవిధంగా, ప్రాజెక్ట్ ఇన్‌ప్లో 9,85,881 క్యూసెక్కులు కాగా, ఔట్‌ప్లో 8,74,028 క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు జూరాల ప్రాజెక్టు దగ్గర వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది. గత మూడు రోజులుగా 8 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అధికారులు 62 గేట్లు ఎత్తివేశారు. జూరాల ప్రాజెక్టుకు 7లక్షల 74వేల క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో ఉండగా, మత్తం 67 గేట్లకుగానూ 62 గేట్లు ఎత్తివేశారు. జూరాల ప్రాజెక్టు సముద్రాన్ని తలపించే విధంగా ఉంది. అయితే ఇక్కడ పవర్ జనరేషన్ పూర్తిగా స్తంభించిపోయింది. పవర్ జనరేషన్ కేవలం ఒక లక్ష క్యూసెక్కులను తట్టుకునే విధంగా తయారుచేసేందుకు పవర్ జనరేషన్‌ను నిలిపివేశారు.

ఉప్పొంగుతున్న కృష్ణా: కాలువకు గండి

ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణ నది ఉప్పొంగుతుంది. దీంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి.. దిగువకు నీటిని వదులుతున్నారు. అయితే శ్రీశైలం బ్యాక్ వాటర్ ఎ÷-లో అధికంగా ఉండటంతో.. మంగళవారం కర్నూలు జిల్లా జూటూరు గ్రామ సమీపంలో ఎస్ఆర్ఎంసీ కాల్వకు గండి పడింది. దీంతో శ్రీశైలం బ్యాక్ వాటర్.. భారీగా తెలుగు గంగలోకి చేరుతుంది. వరద నీరు కారణంగా చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ముంపుకు గరయ్యే ప్రమాదం పొంచి ఉండటంతో.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు జిల్లాలోని కొత్తపల్లి మండలం మూసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజు గ్రామాల్లోకి శ్రీశైలం బ్యాక్ వాటర్ వచ్చి చేరుతోంది. దీంతో ఆయా గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉంది. పంట పొలాల నుంచి గ్రామాల్లోకి వరద నీరు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# పంజాబ్ బంద్ ప్రశాంతం

### - ఢిల్లీలో గురురవిదాస్ ఆలయం కూల్చివేత
### - నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చిన రవిదాసియా వర్గీయులు

ఛండీగఢ్, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లో 500 సంవత్సరాల నాటి పురాతన శ్రీ గురు రవిదాస్ ఆలయం, సమాధి కూల్చివేతకు నిరసనగా పంజాబ్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం పంజాబ్ బంద్‌కు రాష్ట్రంలోని రవిదాసియా వర్గం పిలుపు ఇచ్చింది. లూధియానా, జలంధర్, గురదాస్ పూర్, అమృత్ సర్‌లలో అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. రవిదాసియా వర్గీయులు జాతీయ రహదారులను దిగ్బంధించారు. బంద్ కారణంగా మంగళవారం జరగాల్సిన పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగనప్పటికీ పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. సమస్య పరిష్కారానికి శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్బీర్ సింగ్ బాదల్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్న అనిల్ బైజల్‌తో తాము చర్చించామని, గురు రవిదాస్ ఆలయ కూల్చివేతపై తమ అసంతృప్తిని వెల్లడించగా, సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని ఆయన హామీ ఇచ్చారని బాదల్ ట్వీట్ చేశారు. చారిత్రక ఆలయ కూల్చివేతను తీవ్రంగా ఖండిస్తున్నామని బాదల్ పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం నెలకొన్ని ఉద్రిక్త పరిస్థితులపై ఆయన ఢిల్లీలో సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. ఆప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అకాలీదళ్ నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఇది రవిదాస్ వర్గ మనోభావాలను గాయపరుస్తుందని అన్నారు. పార్టీ ప్రతినిధి బృందం త్వరలో హోంమంత్రి అమిత్ షాను కలిసి ఈ వ్యవహారం తీవ్రతను ఆయన దృష్టికి తీసుకువెళతామని బాదల్ స్పష్టం చేశారు.

# విద్యుత్‌పై కేసీఆర్ ముందుచూపు

### ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు

సూర్యాపేట,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): నిరంతర విద్యుత్ విషయంలో సీఎం కేసీఆర్ ముందు చూపుతో వ్యవహరిస్తున్నారని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు స్పష్టం చేశారు. చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. రైతులకు, పరిశ్రమలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విద్యుత్ వినియోగించుకునేందుకు గ్రిడ్స్ ద్వారా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. విద్యుత్ అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని, విద్యుత్ విషయంలో ఎల్లప్పుడూ ముఖ్యమంత్రికి పూర్తి నివేదిక అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీ వార్తలు

# రద్దునిర్ణయాలపై టిడిపి అసంతృప్తి

### సరైనవే అంటున్న వైకాపా నేతలు

అమరావతి,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ టెండర్ల రద్దు, అన్న క్యాంటీన్ల మూసివేత, ఇలా సిఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు టిడిపికి మింగుడు పడడం లేదు. తాజాగా మచిలీపట్నం పోర్టును కూడా రద్దు చేస్తూ జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ రద్దుల జాబితాలో ఇంకెన్ని చేరతాయో తెలియదని టిడిపి ఎద్దేవా చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల పనులు కోల్పోయిన కొందరయినా న్యాయస్థానాలను ఆశ్రయించకుండా ఉండరు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని వైకాపా నేతలు అంటున్నారు. వైఎస్ జగన్ పాలన చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వం కూడా అసహనంగా ఉందన్న వార్తలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న ఈ ధోరణిపై ప్రజల్లో కూడా సందేహాలు నెలకొంటున్నాయి. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం ఉండేదనీ, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని విమర్శలు వస్తున్నాయి. గన్నవరం విమానాశ్రయం విస్తరణకు భూములు ఇచ్చిన రైతులకు రాజధానిలో ప్లాట్లు కేటాయిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి ఒప్పించింది. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని భూములు ఇచ్చినవారు వాపోతున్నారు. అలాగే రాజధానికి భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయిస్తామని గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వాలు మారినప్పుడు ప్రాధాన్యాంశాలు మారవచ్చు గానీ అమలులో ఉన్నవాటికి ప్రత్యామ్నాయం చూపకుండా అర్ధంతరంగా నిలిపివేయడం సమంజసం కాదన్న విమర్శలు వస్తున్నాయి. జగన్ ప్రభుత్వ నిర్ణయాల దుష్ప్రభావం ముందుముందు ప్రజలకు స్పష్టంగా తెలుస్తుంది. సౌర విద్యుత్తు ఒప్పందాల విషయానికే వద్దాం. ఒప్పందం కుదుర్చుకున్న రేట్లను తగ్గించడానికి జగన్ ప్రభుత్వ అధీనంలోనే ఉన్న జెన్‌కో కూడా అంగీకరించడం లేదు. అలాంటిది ప్రైవేటు సంస్థలు ఎందుకు అంగీకరిస్తాయి.

# శ్రీవారిని దర్శించుకున్న శ్రీదేవికుమార్తె

### – లంగావోణీలో సంప్రదాయ పద్దతిలో దర్శనంచేసుకున్న జాన్వి

తిరుమల, ఆగస్టు14 (ఆర్ఎన్ఎ) : అతిలోక సుందరి శ్రీదేవి మన నుంచి దూరమై ఏడాది దాటిపోయింది. శ్రీదేవి ఈ లోకంలో లేకపోయినా ఆమె జ్ఞాపకాలను మాత్రం ఇక్కడ విడిచిపెట్టి వెళ్లిపోయారు. శ్రీదేవి జ్ఞాపకాలను ఆమె కుటుంబ సభ్యులతో పాటు అభిమానులు ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటారు. మంగళవారం శ్రీదేవి 56వ జయంతి సందర్బంగా మరోసారి ఆమెను అంతా తలుచుకుంటున్నారు. మనకు కనిపించని లోకంలో ఉన్న అతిలోక సుందరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక శ్రీదేవి కుమార్తె, నటి జాన్వి కపూర్ తన తల్లి కోసం ప్రత్యేక పూజలు చేయడానికి తిరుమల వచ్చారు. ఆమె తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రీవేంకటేశ్వరుడిని ప్రార్థించారు. శ్రీదేవి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని జాన్వి కపూర్ దర్శించుకున్నారు. తన స్నేహితురాలితో కలిసి కాలినడకన తిరుమల చేరుకున్న జాన్వి.. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో తిరుమలేశుడిని దర్శించుకున్నారు. తిరుమలలో తన స్నేహితురాలితో తీసుకున్న ఫొటోను జాన్వి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. తెలుగింటి ఆడపడుచుకి కుమార్తె అయిన జాన్వి సంప్రదాయ లంగావోణీలో చాలా అందంగా కనిపించారు. బయట ఎప్పుడూ మోడరన్ దుస్తుల్లో కనిపించే జాన్వి ఈ సంప్రదాయ వస్త్రధారణలో కొత్తగా ఉన్నారు. ఇదిలా ఉంటే, తన తల్లి జయంతిని పురస్కరించుకుని జాన్వి ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ పోస్ట్ ఒకటి పెట్టారు. హ్యాపీ బర్త్‌డే మమ్మా, ఐ లవ్ యు అని శ్రీదేవి అందమైన ఫొటోను షేర్ చేశారు.

# అక్టోబరు 15న రైతు భరోసా పథకం

### ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం

### వెల్లడించిన సిఎం వైఎస్ జగన్

విజయవాడ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): అక్టోబరు 15న రైతు భరోసా పథకాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం జగన్ వెల్లడించారు. మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన సీఎం జగన్.. రైతు భరోసా పథకం ప్రారంభానికి ప్రధాని మోదీని ఆహ్వానించానని చెప్పారు. 11 నెలల కాలానికి గ్రామ సచివాలయం నుంచి కౌలు రైతులకు కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. కౌలు రైతులకు కార్డులు అందగానే.. రైతు భరోసా పథకానికి వారు అర్హులవుతారని సీఎం వివరించారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రానికి కృష్ణా జలాలు వచ్చాయని పేర్కొన్నారు. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చెరువులు నింపాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు. ఉగాది నాటికి ఇంటి స్థలం లేని వాళ్లు ఉండకూడదన్నారు. సెప్టెంబర్ నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమలు చేయనున్న పథకాల యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు పథకాల అమలుకు సంబంధించిన షెడ్యూల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వివరించారు. ఇక ఈ షెడ్యూల్ ప్రకారం.. అక్టోబరు 15న రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని సీఎం జగన్ చెప్పారు. దేశంమొత్తం ఈ కార్యక్రమాల వైపు చూడాలని సీఎం ఆకాక్షించారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా చూసు కోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయమే కౌలు రైతులకు కార్డులు ఇస్తుందని వెల్లడించారు. 11 నెలల కాలానికి ఇది వర్తిస్తుందని అన్నారు. రైతులకు ఎలాంటి నష్టం రాకుండా, భూమిపై తమకున్న హక్కులకు భంగం వాటిల్లకుండా కేవలం పంటపైన మాత్రమే 11 నెలలపాటు కౌలు రైతుకు హక్కు లభిస్తుందని తెలిపారు. కౌలు రైతులకు కార్డులు అందగానే వాళు రైతు భరోసాకు అర్హులవుతారని చెప్పారు. ఈ ఒక్కసారికి మాత్రమే రైతు భరోసా రబీకి ఇస్తున్నామని.. వచ్చే ఏడాది నుంచి మేలో ఇస్తామన్నారు. తద్వారా ఖరీఫ్‌లో రైతులకు బాసటగా ఉంటామని అన్నారు.

# భారీ వర్షలతో పొంగుతున్న వాగులు

### ఇంకా నీటిలోనే లంక గ్రామాలు

### తమలపాకు, కూరగాయాల తోటలకు తీరని నష్టం

విజయవాడ,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలను ఇటీవల భారీ వర్షాలు ముంచెత్తాయి. కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఎడతెరపిలేని వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు పలు మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.వందల ఎకరాల్లో వరి పంట నీటమునింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో కలెక్టర్, అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం కుంగదీసింది. దీంతో గోదావరి ఉధృతంగా ప్రవహించింది. పోలవరం నుంచి ఇటుకలకోట వెళ్లే మార్గంలో పొలాలన్నీ మరో గోదావరిని తలపిస్తున్నాయి. కొన్నిరోజులుగా రెండు వేల ఎకరాల్లోని వరి చేలు, వరి నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న నారుమళ్లు నీటిలోనే ఉన్నాయి. పొలాల్లోని నీరంతా పాత పోలవరం వద్ద నిర్మించిన కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిస్ ద్వారా గోదావరిలోకి వెళ్లాలి. కాలువలో విపరీతంగా పెరిగిన తూడు ప్రవాహానికి అడ్డుగా ఉంది. నీరు తగ్గడానికి మరో మూడు రోజులు పడుతుందని రైతులు చెబుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో వశిష్ఠ గోదావరి పరివాహక గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఇంకా అక్కడి ప్రజలు ముంపు అవస్థలను అనుభవిస్తున్నారు. గోదావరి వరద ఉధృతికి యలమంచిలి మండలంలో కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల, ప్లలెపాలెం, బూరుగుపల్లి, కె.ఎస్.పాలెం, అబ్బిరాజుపాలెం, యలమంచిలిలంక తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో పునరావాస కేంద్రాల్లోనే ప్రజలు గడపాల్సి వచ్చింది. కనకాయలంక కాజ్‌వే మునిగి పోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద నీటిలో పడవల్లోనే తిరగాల్సిన పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం గోదావరి ఉధృతి తగ్గడంతో గ్రామాల్లో మాములు పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాజ్‌వేపై మాత్రం ఇంకా నీటి ఉధృతి కొనసాగుతోంది. లంక గ్రామాల్లో వంద ఎకరాలు పైబడి తమలపాకు తోటలు ముంపునకు గురయ్యాయి. ఎకరానికి రూ. 3 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. శ్రావణ మాసంలో కోత ప్రారంభిద్దామనుకున్న తరుణంలో వరద నీరు నష్టం మిగిల్చిందని తమలపాకు రైతులు విలపిస్తున్నారు. కొబ్బరి తోటల్లోకి వరద నీరు చేరడంతో కొంత నష్టం కలుగుతుందని ఆ రైతులు అంటున్నారు. కాయగూరల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాలకొల్లు నియోజకవర్గంలో వరి సాగుకు సంబంధించి నారుమడులు 360, వరినాట్లు 280 హెక్టార్లలో నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పొలాల్లో నీరు తగ్గుతుండడంతో గ్రామాల వారీగా నష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. నిడదవోలు, పెరవలి మండలాల్లో లంక గ్రామాలను ముంచెత్తడంతో కూరగాయలు, ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. గత వారం రోజులుగా ముంపులోనే ఉండటంతో పలు పంటలు కుళ్లిపోయాయి. పెట్టుబడులన్నీ గోదావరి పాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరవలి మండలంలో ముక్కామల, ఖండవల్లి, కాకరపర్రు, తీపర్రు తదితర గ్రామాల్లో అరటి, కంద, పసుపు వంటి పంటలతో పాటు కూరగాయల తోటలు చాలా వరకు కుళ్లిపోయాయి. పశుగ్రాసం కూడా నీట మునిగి ఎందుకూ పనికిరాకుండా పోయింది.

# కుందూనదిలో నలుగురు గల్లంతు

కడప,ఆగస్టు14(ఆర్ఎన్ఎ):కడప జిల్లా కమలాపురం సమీపంలోని కుందూ నదిలో నలుగురు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం దర్గా వీధికి చెందిన జాఫర్ హుస్సేన్(42), చిన్నారులు ఇర్ఫాన్ (12), జకీర్ (12), షాహీద్ (10) వారి కుటుంబసభ్యులతో కలిసి కుందూ నది ఒడ్డుకు వెళ్లారు. అక్కడే మధ్యాహ్న భోజనాలు చేసి సరదాగా గడిపారు. అప్పటికే శ్రీశైలం నుంచి కుందూ నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సాయంత్రం వేళ నదిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. ఈ క్రమంలో సరదాగా ఆడుకుంటున్న వారు ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయారు. గల్లంతైన వారిలో జాఫర్ హుస్సేన్ మృతదేహం లభ్యమైంది. చిన్నారుల కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు.

# చలో కలెక్టరేట్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

శ్రీకాకుళం,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 'చలో కలెక్టరేట్'లకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని పోలీసులు అడ్డుకునేందుకు.. పలాస మండలంలో 19 పంచాయతీల్లో పని చేస్తున్న ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అస్టెంట్‌లను కాశిబుగ్గ పోలీసులు ఉదయం 4 గంటలకు అరెస్టు చేశారు. మరో వైపు.. ఉదయం 4 గంటలకు పోలీసులు కోటబమ్మాలి మండలంలో ఉన్న 22 మంది ఎఫ్ఎ ల ఇళ్లకు వెళ్లి వారిని అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా.. నౌపడ, సంతబమ్మాలి పోలీసుస్టేషన్లో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు భగం చేశారు. నౌపడ లో అయిదుగురిని, సంతబమ్మాలి లో పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం ధర్నాకు వెళుతున్న ఫీల్డ్ అస్టెంట్లను ఇచ్ఛాపురంలో ముందస్తు అరెస్టులు చేశారు.

# ఇంకుడు గుంతలు ఉంటేనే ఇంటికి పర్మిషన్

### విజయవాడ కార్పోరేషన్ నిర్ణయం

విజయవాడ,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): విజయవాడ కార్పొరేషన్ పరిధిలో ఇకపై 200 చదరపు గజాలు, ఆ పైబడిన విస్తీర్ణంలో నిర్మించుకునే ఇళ్లకు తప్పనిసరిగా ప్లానులో ఇంకుడు గుంతను చేరిస్తేనే ప్లానుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇంకుడు గుంతలతోపాటు ఆన్‌సైట్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటు ఉన్న అపార్ట్‌మెంట్లకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని టౌన్ ఎ÷-లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. కృష్ణానది పక్కనే ప్రవహిస్తున్నా.. ప్రతి యేటా వేసవి కాలం వచ్చిందంటే విజయవాడ లోని చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తుతుంటుంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే నగర పరిధిలో భూగర్భ జల మట్టాలను పెంపొందించడం ఒక్కటే మార్గమని వీఎంసీ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. భూగర్భ జలమట్టాలను పెంపొందించాలంటే నగరవాసులకు వర్షపు నీటి నిర్వహణపై అవగాహన కల్పించడం తోపాటు ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరించి, వాటని ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి చేయాలని ఆయన నిర్ణయించారు. నిర్ణయాన్ని అమలు చేయడంలో భాగంగా తొలుత వీఎంసీ అధికారులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి నగరంలోని భవనాలను తనిఖీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అదే సమయంలో నగరంలో ఉన్న భవనాల్లో ఇప్పటికే వర్షపు నీటి నిర్వహణ అమలు చేస్తున్న భవనాల జాబితాను కూడా సిద్ధం చేయాల్సిందిగా వీఎంసీ కమిషనర్ అధికారులను కోరారు. అధికారుల బృందం ఆగస్టు నెలలో నగరంలో ఉన్న భవనాలను తనిఖీలు చేసి వాటిలో వర్షపు నీటి నిర్వహణకు ఉన్న ఏర్పాట్లను పరిశీలిస్తారు. ఇంకుడు గుంతలను తవ్వుకున్నారా లేదా పరిశీలిస్తారు. నగరవ్యాప్తంగా సుమారు 2.05 లక్షల భవనాలు ఉన్నాయి. వీటిలో 80 శాతం భవనాల్లో ఇంకుడు గుంతలు లేవని, ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ నగరంలో కురిసే 90 శాతం వర్షపు నీరు వృథాగా పోతోంది. ఇంకుడు గుంతలతో ఒక కుటుంబానికి మూడు సంవత్సరాలపాటు కావాల్సిన వర్షపునీటిని ఒక్క ఏడాది వర్షాకాలంలో కురిసే వాననీటి నుంచే సేకరించవచ్చు.

# మలికిపురం స్టేషన్‌ను సందర్శించిన డిఐజి ఖాన్

### ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం

కాకినాడ,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): జనసేన కార్యకర్తల దాడిలో ధ్వంసమైన తూర్పుగోదావరి జిల్లా మలికిపురం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఏలూరు రేంజ్ డీఐజీ ఏఎస్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక బాధ్యత గల ఎమ్మెల్యే బాధ్యతా రహితంగా వ్యవహరించడం సమాజానికి మంచిది కాదన్నారు. ఇలాంటి తొందరపాటు చర్యలు సమాజంలో యువతకు పోలీస్ వ్యవస్థను ఏమైనా చేయొచ్చనే తప్పుడు సంకేతాలు వెళ్ళతాయని తెలిపారు. సోషల్ మీడియాలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ మాట్లాడిన వీడియో ఆధారంగా, పీఎస్ ముట్టడిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒక మండల స్థాయి అధికారి అయిన ఎస్ఐను బాధ్యత గల ప్రజాప్రతినిధి దూషిస్తూ.. దాడికి పాల్పడటం సమంజసం కాదన్నారు. ఎస్ఐ తప్పు చేసి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. చర్యలు తీసుకునే వాళ్లమని తెలిపారు.

# రైలుకు ఎదురెల్లి యువకుడి ఆత్మహత్య

తిరుపతి,ఆగస్ట్14 (ఆంఎన్ఎ): యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చిత్తూరు జిల్లా పుత్తూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం మిద్దిగుంట రైల్వే గేట్ వద్ద రైలు ఢీకొని యువకుడు మృతి చెందినట్లు తెలిపారు. గేటు సెక్యూరిటీ తెలిపిన వివరాల ప్రకారం..ఉదయం ఓ బుల్లెట్ పై వచ్చిన యువకుడు తన వాహనాన్ని గేటుకు కూతవేటు దూరంలో ఉంచి, రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిపాడు. రైల్వే డ్రైవర్ సిగల్ వేసినప్పటికీ ఆ యువకుడు సిగ్నల్‌కు ఎదురుగా నడుచుకుంటూ వెళ్లినట్లు గేటు సెక్యూరిటీ చెప్పాడు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. వెంటనే రేణిగుంట రైల్వే పోలీస్ అధికారులకు సమాచారం అందించడంతో.. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉండవచ్చునని అంచనా వేశారు. యువకుడు వచ్చిన వాహనం రిజిస్ట్రేషన్ ఆధారంగా వివరాలు సేకరించే ప్రయత్నంలో ఉన్నారు.

# ఒక్కరోజే రూ. 2000 పెరిగిన వెండి

### స్వల్పంగా తగ్గిన బంగారం ధర

### నష్టాలతో ముగిసిన మార్కెట్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధర చుక్కలను తాకుతున్నాయి. కొనుగోళ్ల అండతో పాటు అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలతో బులియన్ మార్కెట్లో నేడు వెండి ధర దూసుకెళ్లింది. మంగళవారం ఒక్క రోజే రూ. 2000 పెరిగి జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. నేటి మార్కెట్లో కేజీ వెండి ధర రూ. 45,000కు చేరినట్లు ఆల్ ఇండియా సఫారా అసోసియేషన్ వెల్లడించింది. అటు బంగారం ధర నేడు స్వల్పంగా దిగొచ్చింది. రూ. 100 తగ్గడంతో దేశ రాజధానిలో 10 గ్రాముల పసిడి ధర రూ. 38,370గా ఉంది. అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లలో ఒత్తిడి పెరగడంతో బంగారం, వెండిలో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరమని మదుపర్లు భావించారు. దీంతో ఈ లోహాల ధరలు పెరిగాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగానూ వీటి ధరలు పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం 1,520.37 డాలర్లు, ఔన్సు వెండి 17.32 డాలర్లు పలికింది. ఇటీవల బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఈ లోహాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు అమెరికా, యూరప్ మార్కెట్ల ఈక్విటీ ఫ్యూచర్లు పడిపోవడంతో భారత మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ సెన్సెక్స్ 624 పాయింట్లు, 1.66 శాతం నష్టపోయి 36,958 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ నిఫ్టీ 184 పాయింట్లు, 1.65 శాతం నష్టపోయి 10,926 వద్ద స్థిరపడింది. ఎస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫినాన్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఐషెర్ మోటార్స్, ఐటీసీ, మారుతి సుజుకీ, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి.

# మునుగోడు లంకలో చిక్కుకున్న గొర్రెల కాపర్లు

విజయవాడ,ఆగస్టు14 (ఆంఎన్ఎ): కృష్ణమ్మ వరదలో 400 గొర్రెలు, నలుగురు కాపరులు చిక్కు కున్నారు. ఎగువ నుంచి వచ్చిన వరదతో కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం మునుగోడు లంక జలదిగ్బంధమైంది. గొర్రెలను మేపేందుకు వెళ్లిన కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన కాపరులు వరద నీరు ముంచెత్తడంతో సంగిళ్లపాలెం సమీపంలోని కృష్ణా లంక భూముల్లో చిక్కుకు పోయారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు వారిని కాపాడాలంటూ స్థానికులు పోలీసులను కోరారు. అప్రమత్తమైన పోలీసులు, రెవెన్యూ అధికారులు కాపరులను కాపాడడానికి ప్రత్యేక పడవల్లో లంకకు వెళ్లారు.

# పంద్రాగస్ట్ వేడుకలకు కాశ్మీర్ సిద్ధం

### భారీగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

### కాశ్మీర్‌లో జెండా ఎగురేయనున్న అమిత్ షా?

శ్రీనగర్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు జమ్మూకశ్మీర్ ముస్తాబవుతోంది. భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వాతంత్రదినోత్సవ వేడుకల్లో జమ్మూకశ్మీర్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శ్రీనగర్ లోని శెర్-ఐ-కశ్మీర్ స్టేడియంలో కళాకారుల బృందాలు రిహార్సల్స్ చేస్తున్నాయి. మరోవైపు సైనిక బలగాలు, జవాన్లు పరేడ్ రిహార్సల్స్ చేస్తున్నారు. కళాకారుల బృందాలతో జమ్మూకశ్మీర్ లో సందడి వాతావరణం నెలకొంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 15న శ్రీనగర్‌లోని లాల్ చౌక్‌లో జాతీయ జెండాను ఎగురవేయబోతున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ నెల 16, 17 తేదీల్లో లడఖ్‌లో పర్యటిస్తారని కూడా సమాచారం అందుతోంది.

370 రద్దు తరవాత వస్తున్న తొలి స్వాతంత్ర్య వేడుకలు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాహసోపేతమైన చర్యలతో జమ్మూ-కశ్మీరును భారత దేశంలో పరిపూర్ణంగా అంతర్భాగం చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జమ్మూ-కశ్మీరు ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిత్ కన్సల్ మంగళవారం మాట్లాడుతూ జమ్మూ-కశ్మీరు, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాల్లో అన్ని జిల్లాల్లోనూ స్వాతంత్య్ర దినోత్సవాలను నిర్వహించేందుకు డ్రెస్ రిహార్సల్స్ జరుగుతున్నాయన్నారు. ఈద్ పండుగ ప్రశాంతంగా ముగియడంతో నిషేధాజ్ఞలను సోమవారం మరింతగా సడలించినట్లు తెలిపారు. జమ్మూ ప్రాంతంలో దాదాపు ఆంక్షలు లేవన్నారు. కశ్మీరులో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఆంక్షలు ఉన్నట్లు తెలిపారు.

# దేవాలయంలో హుండీ చోరీ

గుంటూరు,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): గుంటూరు జిల్లా నర్సరావుపేట ప్రకాష్ నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగు చూసింది

. దేవాలయంలో ఉన్న హుండీని పగులకొట్టి దానిలో ఉన్న నగదును దొంగలు దోచుకెళ్లినట్లు దేవస్థాన పూజారి తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు.. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. హుండీలో సుమారు రూ.6, 7 వేలు ఉండొచ్చని భావిస్తున్నారు.

వెంటిలేటర్ కిటికీ ని తొలగించి గుడిలో దొంగలు చొరబడి ఉండవచ్చునని, ఆ వెంటిలేటర్ లో మనిషి పట్టే అవకాశం కూడా లేదని పోలీసులు చెప్పారు. ఒకటో పట్టణ ఎస్సై నాగేశ్వరరావు తన సిబ్బందితో వచ్చి వివరాలను సేకరించారు. సుమారు రాత్రి రెండు గంటల సమయంలో చోరీ జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# లంక గ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు

విజయవాడ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను పైకి ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీలో ప్రస్తుతం 10 అడుగుల నీటి మట్టముంది. తొలుత నీటిమట్టం 12 అడుగులకు చేరితే గేట్లు తెరవాలని అధికారులు భావించినప్పటికీ వరద ప్రవాహం అధికంగా ఉండటంతో ముందుగానే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 3.05 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 2.5 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి వస్తున్న వరద కారణంగా పట్టిసీమ నుంచి వస్తున్న నీటిని నిలిపివేశారు.




సిరిసిల్ల పట్టణంలో కంటి ఆస్పత్రి నిర్మాణ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

# ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### కంటి ఆస్పత్రి శంకుస్థాపన చేసిన కేటీఆర్

సిరిసిల్ల,ఆగస్టు14 (ఆంఎన్ఎ): ప్రజల ఆరోగ్యానికి సంబంధించిప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. కంటివెలుగు బాగా సక్సెస్ అయ్యిందన్నారు. పట్టణంలోని పొదుపు భవన్ ఆవరణలో కంటి ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన జరిగింది. ఎల్వీప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కంటి ఆస్పత్రి భవనానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..తెలంగాణలో సిరిసిల్లతో కలిపి ఏడు సెంటర్లు ఉన్నాయి. సామాజిక బాధ్యతతో ఎంతో మంది ముందుకు వచ్చి ప్రసాద్ ఐ సెంటర్ మంచి కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. ఇతరులు కూడా స్పూర్తి పొంది మంచి పనులు చేసేం దుకు ముందుకు రావాలని పిలుపుని చ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కంటి వెలుగు దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. కంటి వెలుగు పథకంతో పేదలకు కంటి పరిక్షలు చేయించామని తెలిపారు. దీంతో పాటుపేదల ఆరోగ్య పరీక్షలకు సిఎం కెసిఆర్ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

# ప్రజలందరూ మోదీ వైపే ఉన్నారు

**- పార్టీ మార్పుపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటా**

**- వైఎస్ఆర్ పేరును నిలబెట్టేలా జగన్ పాలన ఉండాలి**

**- కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

తిరుపతి, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నల్గొండ జిల్లా మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల రాజగోపాల్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. కాశ్మీర్ అంశంపై మోదీ తీసుకున్న నిర్ణయంపై దేశ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారని అన్నారు. మోదీ, అమిత్ షా నేతృత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. చైనా తర్వాత భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారిందంటే దానికి కారణం నరేంద్ర మోదీనే అన్నారు. భారతదేశపు ప్రజలందరూ మోదీ వైపు చూస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు మోదీ చూపిన చొరవ, ఆయన నిర్ణయాలు అమోఘమన్నారు. అందుకే మరోసారి తిరుగులేని మెజార్టీతో ప్రజలు మోదీ పట్టం కట్టారని అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు ప్రస్తుతానికి ఊహాగానాలే అని, పార్టీ మార్పు పై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని కోమటి రెడ్డి అన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ అరాచక పాలన సాగిస్తున్నారని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

కేవలం కొందరికే అధికార ఫలాలు అందుతున్నాయని, పేదలకు మెరుగైన సేవలు అందించటంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేవలం మాయమాటలతోనే కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టి గెలుస్తున్నాడని, ఇక ప్రజలంతా కేసీఆర్ మాయలను అర్థంచేసుకున్నారని, ఇక గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఏపీలో జగన్ పాలన చేపట్టి రెండు నెలలే అవుతుందని, రెండునెలల్లో ఆయన విధానాలు ఎలా ఉంటాయనేది ఏమీ చెప్పలేమని అన్నారు. ఆర్నెళ్లు పాలన పూర్తయితేకానీ జగన్ పాలనపై, ఆయన నిర్ణయాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరు నిలబడేలా జగన్ పాలన ఉండాలన్నారు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు అరెస్టు వారెంట్

కోల్‌కతా, ఆగస్ట14(ఆంఎన్ఎ) : భాజపాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కారణంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు కోలకతాలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం అరెస్టు వారెంట్ జారీ చేసింది. వివరాల్లోకి వెళితే గతేడాది జులైలో కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగిన ఒక రాజకీయ సభలో థరూర్ మాట్లాడు తూ. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి భాజపా తిరిగి అధికారం చేపడితే భారతను 'హిందూ పాకిస్థాన్'గా మారుస్తుం దంటూ తీవ్రవాఖ్యలు చేశారు. భాజపా ప్రస్తుతం ఉన్న భారత రాజ్యాంగాన్ని మార్చి తమకు అనుకూలంగా సవరణలు కూడా చేస్తుందని వ్యాఖ్యానిం చారు. పాకిస్థాన్‌లో మాదిరిగా మైనార్టీ వర్గాలకు ఏ మాత్రం విలువనివ్వరని, పూర్తిగా అణిచి వేస్తారంటూ విమర్శలు చేశారు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా అజాద్‌లాంటి గొప్ప నాయకులు, స్వాతంత్య్ర యోధు లు కలలుగన్న లౌకికవాద భారత దేశాన్ని నాశనం చేస్తారంటూ తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుమిత్ చౌదరీ అనే న్యాయవాది థరూర్‌పై కోల్‌కతా కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన కోర్టు ఆయనకు ఆరెస్టు వారెంటు జారీ చేసింది.

# బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్..

**- కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలపై గురి**

**- మళ్లీ బీజేపీలోకి రాములమ్మ!**

**- 18న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ సభలో పాల్గొనున్న అమిత్‌షా**

**- అమిత్‌షా సమక్షంలో భారీగా చేరికలకు రంగంసిద్ధం**

తెలంగాణ, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : కేంద్రంలో తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. మిగిలిన రాష్ట్రాల్లోనూ పాగావేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనిలో భాగంగానే ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి చేర్చుకొని అధికారంలోకి వచ్చిన బీజేపీ, అదే వ్యూహాన్ని హర్యానాలోనూ అమలు చేసేందుకు సిద్ధమైంది. ఒక్క ఎమ్మెల్యే లేని హర్యానా అసెంబ్లీలో ఏకంగా ఒకే రోజు పది మంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకొని రెండవ అతిపెద్ద పార్టీగా అక్కడ అవతరించింది. రాబోయే కాలంలో అక్కడా అధికారాన్ని చేపట్టేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. ఇలా అన్ని రాష్ట్రాల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావటమే ధ్యేయంగా మోదీ, అమిత్‌షా ఆధ్వర్యంలోని త్రయం పనిచేస్తుంది. ఇందులో భాగంగా ఇప్పుడు బీజేపీ కేంద్ర అధిష్టానం గురి తెలంగాణపై పడింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి తెలంగాణలో అధికారం దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ నాలుగన్నరేళ్ల ముందే అందుకు అనుగుణంగా స్కెచ్ వేస్తోంది. రాష్ట్రంలో వివిధ పార్టీల్లో కీలకంగా ఉన్న నేతలతో పాటు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలపై కన్నేసింది. కొందరు బీజేపీ నేతలు ఆయా నేతలతో మంతనాలు సాగిస్తూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బీజేపీలోకి టచ్‌లో ఉన్నారు. ఇటీవల బీజేపీ తీర్థం పుచ్చుకొనేందుకు సిద్ధమైన ఆయన, మళ్లీ వెనక్కు తగ్గారు. కాగా త్వరలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం విస్తృతంగా సాగుతుంది. మరోవైపు మాజీ ఎంపీ వివేక్‌సైతం ఇటీవల బీజేపీలో చేరారు. తెలంగాణలోని ప్రముఖ నాయకులందరినీ పార్టీలోకి ఆహ్వానిస్తుంది బీజేపీ అదిష్టానం. ఈ నేపథ్యంలోనే ఒకప్పటి హీరోయిన్, ప్రస్తుతం టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతిని తిరిగి బీజేపీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. వాజ్‌పేయి హయాంలో బీజేపీలో విజయశాంతి కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పరిణామాలతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. అప్పటి నుంచి ఆమె రాజకీయ ప్రయాణం ఒడిదుడుకులతో సాగుతోంది. కొద్దికాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న విజయశాంతి ప్రస్తుతం తెలంగాణలో స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారు. అయితే తెలంగాణలో బలపడాలని చూస్తున్న బీజేపీ విజయశాంతిని తిరిగి పార్టీలోకి ఆహ్వానించినట్లు, దీనికి ఆమె అంగీకారం తెలిపినట్లు వార్తలు వస్తున్నాయి. విజయశాంతితో పాటు మాజీ డిప్యూటీ సీఎం కూడా కమలం గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. వారి బాటలోనే ముగ్గురు మాజీ ఎంపీలు, 8మంది మాజీ ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరుందుకు సుముఖంగా ఉన్నారని, వారితో ఆ పార్టీ నేతలు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పెద్దపల్లికి చెందిన టీఆర్ఎస్ నేత కూడా బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 18వ తేదీన నాంపల్లిలో ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే సభలో కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పాల్గొనున్నారు. ఆయన సమక్షంలో భారీగా చేరికలు ఉంటాయని బీజేపీ నేతలు చెబుతున్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

కరీంనగర్,ఆగస్ట14 (ఆంఎన్ఎ): స్వాతంత్ర్య వేడుకలకు పరేడ్ మైదానంలో ఘనంగా ఏర్పాట్లు చేసారు. మంత్రి ఈటెల రాజేందర్ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. అలాగే ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 15న పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే వేడుకలకు సంబంధిత చర్యలు చేపట్టారు. వర్షాలు పడుతున్నందున వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయాలని ఆర్డీవోను ఆదేశించారు. సీటింగ్ ఏర్పాట్లు సరిగ్గా వుండాలని కరీంనగర్ అర్బన్ తహసీల్దార్‌కుసూచించగా, మైదానాన్ని వేడుకలకు సిద్ధం చేయాలని పోలీస్ అధికారులకు వివరించారు. తాగునీటి వసతి కల్పించాలని కమిషనర్‌ను, మైకు ఏర్పాటు చేయాలని ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్‌ను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన శకటాలను వేడుకల్లో ప్రదర్శించాలని సంక్షేమ శాఖల అధికారులను కోరారు. ఆయా శాఖల్లో మంజూరైన సంక్షేమ యూనిట్లను ఆర్థికమంత్రి ఈటెల చేతులమీదుగా లబ్ధిదారులకు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన పరేడ్ మైదానం

మహబూబ్‌నగర్,ఆగస్ట14(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు పోలీసు పరేడ్ మైదానం ముస్తాబయ్యింది. ఇక్కడే జెండా ఆవిష్కరణ జరుగనుంది. ఇక్కడే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రి శ్రీనివాసగౌడ్ పతాక ఆవిష్కరణ, వందన స్వీకారం చేస్తారన్నారు. స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టారని జిల్లా రెవెన్యూ అధికారితెలిపారు. పంద్రాగస్టు సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ అలంకరించారు. ప్రభుత్వ శాఖలన్నీ సంయుక్తంగా జెండా పండగకు పకడ్బందీ ఏర్పాట్లు చేసారు. ఆయా శాఖల పురోగతి ప్రదర్శిస్తూ శకటాలు, స్టాల్స్ ఏర్పాటుతో పాటు సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆహ్వానితులంతా ఉదయం 8.40 గంటలకు మైదానానికి హాజరుకావాలని చెప్పారు. వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన. 10గంటలకు విద్యార్థిల సాంస్కృతిక ప్రదర్శనలు. 11 గంటలకు బహుమతి ప్రదానం, యోగ్యతా ప్రశంస పత్రాల పంపిణీ, 11.30 గంటలకు కార్యక్రమం ముగింపు ఉంటుందని డీఆర్వో పేర్కొన్నారు.

# రిజర్వాయర్‌లను పూర్తిస్థాయిలో నింపండి

**- మనకు నెలరోజులు మాత్రమే అవకాశం**

**- ఈ సమయంలో అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపుకోవాలి**

**- ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి**

**- ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలు సేకరించండి**

**- సెప్టెంబర్ నుంచి జిల్లాల పర్యటనకొస్తా**

**- రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్‌ల సమావేశంలో సీఎం జగన్**

అమరావతి, ఆగస్టు14(ఆంఎన్ఎ) : కృష్ణా జలాలు ఉధృతంగా వస్తున్నందున వాటిద్వారా అన్ని రిజర్వాయర్లను నింపేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో జగన్మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కృష్ణాజలాలు వస్తున్నాయని.. అయితే ఇన్ని జలాలు ఉన్నా రిజర్వాయర్లను పూర్తిగా ఎందుకు నింపలేకపోతున్నామో అధ్యయనం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన(ప్రజా పరిష్కార వేదిక) కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం జగన్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం వల్ల జలాలు వస్తున్నాయని, అన్ని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేశారని, మనకు కేవలం నెలరోజులు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఒక్క నెలలోనే అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపుకోగలగాలని, కృష్ణా పరీవాహక ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకోండని ఆదేశించారు. కొన్ని చోట్ల కాల్వలకు గండ్లు పడుతున్నాయని, గోదావరిలో వరదలు తగ్గుతున్నాయని, ఆ ప్రాంతాల్లో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు కంటెంజెన్సీ ప్లాన్ చేయండి అని కలెక్టర్లకు సూచించారు. ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను సేకరించాలని, వాటి పంపిణీలో కూడా ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని జగన్ సూచించారు. ఆగస్టు చివరి నాటికి ఈ ప్రణాళిక సిద్ధం కావాలని, కరవుకు సంబంధించిన ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే ప్రభుత్వం తగిన సహాయం చేస్తుందని, అవినీతి ఎక్కడా ఉండకూడదన్నారు. ఎమ్మార్వోలు, ఎస్సైలు, దిగువస్థాయి అధికారులకు మరోసారి చెప్పండని, ప్రజలెవరైనా వినతులతో వస్తే వారిని చిరునవ్వుతో స్వాగతించాలని, కలెక్టర్లు తప్పనిసరిగా మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సీఎం జగన్ అధికారులతో పేర్కొన్నారు. తాను సెప్టెంబరు నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని జగన్ తెలిపారు. అప్పటిలోపు మెజార్టీ సమస్యలు పరిష్కరించేలా దృష్టిసారించాలని కలెక్టర్‌లను సీఎం ఆదేశించారు.

# జనసేన ఎమ్మెల్యే వరప్రసాద్ అరెస్ట్

**- అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజోలులో భద్రత పెంపు**

**- గోటితో పోయేది..గొడ్డలిదాకా తెచ్చారు**

**- ప్రజల తరపున పీఎస్‌కు వెళ్లిన రాపాకను అరెస్ట్ చేయడం సరికాదు**

**- వైకాపా ప్రభుత్వం తీరుపై మండిపడ్డ పవన్ కళ్యాణ్**

కాకినాడ, ఆగస్టు14(ఆంఎన్ఎ) : పేకాడుతున్న వారికి వత్తాసు పలకడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌పై దౌర్జన్యానికి దిగి ప్రభుత్వ ఆస్తిని నష్టపరిచారనే అభియోగాలతో తూర్పుగోదావరి జిల్లా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, అతని అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం ఆయనే నేరుగా రాజోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. రాపాకను పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు.

మలికిపురంలో ఆదివారం పేకాడుతున్న 9 మందిని ఎస్ఐ కేవీ రామారావు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిందితులను విడిచిపెట్టాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌తో పాటు అతని అనుచరుడు గెడ్డం తులసి భాస్కర్ ఎస్ఐతో ఘర్షణ పడడమే కాకుండా, సుమారు 100 మందితో కలిసి పోలీస్‌స్టేషన్‌పైకి రాళ్ళు రువ్వి స్టేషన్ కిటికీ అద్దాలు పగులగొట్టారని, పోలీసు విధులకు ఆటంకం కలిగించారని ఎస్పీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేతోపాటు, ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, గతంలోనూ రాపాకపై రెండు కేసులు ఉన్నాయని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ డీఐజీ , ఎస్పీ అద్నన్ నయీం‌అస్మీ హెచ్చరించారు. కాగా మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యేనే నేరుగా రాజోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. రాపాకను పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. ఇటు ఎమ్మెల్యే అరెస్ట్‌తో రాజోలులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. ముందస్తు జాగ్రత్తగా పోలీసుల్ని భారీగా మోహరించారు.

### గోటితోపోయేదాన్ని గొడ్డలిదాకా తేవడం సరికాదు - పవన్ కళ్యాణ్

మరోవైపు రాపాక అరెస్ట్‌పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రజల తరపున పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాపాకపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజలు అడిగితే వారికి మద్దతుగా వరప్రసాద్ వెళ్లారని.. అలాంటి వ్యక్తిపై కేసులు పెట్టడమేంటని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో వైకాపా ఎమ్మెల్యే జర్నలిస్ట్‌పై దాడికి పాల్పడితే ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. మలికిపురం ఘటనలో గోటితో పోయేది గొడ్డలిదాకా తెచ్చారని వ్యాఖ్యానించారు. ఈ ఘటన శాంతిభద్రతల సమస్యగా మారకుండా అధికారయంత్రాంగం పరిష్కరించాలన్నారు. జనసేన కార్యకర్తలు, నాయకులు సంయమనంతో ఉండాలని పవన్ విజ్ఞప్తి చేశారు. పరిస్థితి అదుపుతప్పి.. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిన పక్షంలో తానే స్వయంగా వస్తానన్నారు. మలికిపురం ఘటనపై ఎప్పటికప్పుడు పార్టీ ముఖ్య నేతలతో సమీక్షిస్తున్నట్టు పవన్ చెప్పారు.

# కేంద్రానికి మరికొద్ది సమయమిద్దాం

**- కశ్మీర్‌లో ఆంక్షల్ని సడలించాలని సుప్రీంలో పిటీషన్**

**- విచారణ చేపట్టిన ధర్మాసనం**

**- మలివిడత విచారణ రెండు వారాలకు వాయిదా**

న్యూఢిల్లీ, ఆగస్టు14(ఆంఎన్ఎ) : జమ్ముకశ్మీర్‌లో కేంద్రం నిర్ణయాలకు మరికొంత సమయం ఇద్దామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జమ్ముకశ్మీర్‌లో ఆంక్షల్ని సడలించాలంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ అరుణ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం దీనిపై వాదనలు స్వీకరించింది. రాష్ట్రంలో అన్ని రకాల ఆంక్షల్ని విధించారని పిటిషనర్ తెహసీన్ పూనవాల ధర్మాసనానికి తెలిపారు. దీంతో అరుణ్ మిశ్రా అక్కడి పరిస్థితుల్ని అటార్నీ జనరల్ కేకే.వేణు గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. రోజురోజుకీ అక్కడ పరిస్థితులు మెరుగవుతున్నాయని.. ప్రశాంత వాతావరణానికి కేంద్రం చర్యలు తీసుకుంటోందని వేణుగోపాల్ వివరించారు. క్రమంగా ఆంక్షలు సడలించే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. 2016లో మూడు నెలలు కఠిన ఆంక్షలు విధించారని.. దాదాపు 47 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం అలాంటి ప్రాణనష్టం ఏమీ సంభవించలేదని స్పష్టం చేశారు. మరికొద్ది రోజుల్లో కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అటార్నీ జనరల్ ధర్మాసనానికి వివరించారు. అక్కడ మానవ హక్కుల పరిరక్షణకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు విద్య, వైద్యం లాంటి కనీస వసతులను అందుబాటులో ఉంచామని తెలిపారు. అక్కడి జిల్లాల్లో పరిస్థితుల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటున్నా మ న్నారు. అటార్నీ జనరల్ వ్యాఖ్య లను పరిగణనలోకి తీసుకున్న కోర్టు సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కేంద్రానికి సమయం ఇవ్వాలని నిర్ణయిం చింది. పిటిషన్‌పై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే అధికరణ 370 రద్దు, రాష్ట్ర విభజన లాంటి కీలక నిర్ణయాల నేపథ్యం లో ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్రంలో కేంద్రం భారీ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అలాగే భారీగా బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేసింది. ఈ నేపథ్యంలో భారీ ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొం టునారని.. వెంటనే ఆంక్షల్ని సడలించాలని తెహసీన్ పూనవాల సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

### సిక్కింలో బీజేపీలోకి..

# 10మంది ఎమ్మెల్యేలు

**- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన నడ్డా**

**- రెండో బలమైన పార్టీగా అవతరణ**

గ్యాంగ్‌టక్, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పాగావేసేలా బీజేపీ ముందుకు సాగుతుంది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమవైపుకు తిప్పుకొని అధికారంలోకి వస్తున్న బీజేపీ.. సిక్కింలోనూ ఆమేరకు దీష్టిసారించింది. సిక్కీం అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోని భారతీయ జనతా పార్టీ ఇప్పుడు ఒక్కరోజులోనే రాష్ట్రంలో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇప్పటివరకు ప్రతిపక్ష పార్టీగా ఉన్న సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ పార్టీ నుంచి 10ఎమ్మెల్యేలు మంగళవారం ఒకేసారి భాజపాలో చేరారు. మంగళవారం ఉదయం భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసిన ఎమ్మెల్యేలు.. పార్టీ జనరల్ సెక్రటరీ రామ్ మాధవ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఒక్క సిక్కిం మినహా ఈశాన్య రాష్ట్రాలన్నింటిలో ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో భాజపా అధికార ంలో ఉంది. కొన్నింటిలో నేరుగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగా.. మరి కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారంలో ఉంది. ఈ నేపథ్యం లో తాజా చేరికలతో సిక్కింలోనూ భాజపా బలపడినట్లయింది.సిక్కింలో మొత్తం 32 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రాష్ట్రం లో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చవిచూసింది. ఈ పార్టీకి 15 స్థానాలు రాగా.. సిక్కిం క్రాంతికారి మోర్చా 17 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఎస్‌డీఎఫ్ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ఇద్దరు చెరో రెండు స్థానాల్లో పోటీ చేసి రెండు విజయం సాధించారు. దీంతో ఫలితాల అనంతరం వారు ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలా ఎస్‌డీఎఫ్ సంఖ్యా బలం 13కు పడిపోయింది. ఈ 13 మందిలో 10 మంది ఎమ్మెల్యేలు మంగళవారం భాజపాలో చేరారు.

## అత్తివరదరాజస్వామిని దర్శించుకున్న రజనీకాంత్

కాంచీపురం, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : తమిళనాడులోని కాంచీపురంలో గల అత్తివరదరాజస్వామిని ప్రముఖ నటుడు రజనీకాంత్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం కుటుంబసమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, వేదపండితులు సాదరస్వాగతం పలికారు. అనంతరం రజనీ దంపతులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. వారం క్రితం రజనీ భార్య లత ఒక్కరే ఆలయానికి రాగా.. ఇప్పుడు దంపతులిద్దరూ వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కాంచీపురంలో కొలువైన అత్తివరదరాజ స్వామి 40ఏళ్లకోసారి 48 రోజులు మాత్రమే భక్తులకు దర్శనమిస్తారు. చివరిసారిగా 1979లో భక్తులకు దర్శనమిచ్చిన స్వామి మళ్లీ ఈ ఏడాది జూన్ 1 నుంచి దర్శనమిస్తున్నారు.

## నేడు అభినందన్‌కు..

# వీర్‌చక్ర అవార్డు ప్రదానం




న్యూఢిల్లీ, ఆగస్టు14(ఆర్ ఎన్ఎ) : వింగ్ కమాండర్, పాక్ గడ్డపై అడుగుపెట్టి సురక్షితంగా బయటకి వచ్చిన కమాండర్ అభినందన్‌కు వీర్ చక్రను ప్రదానం చేయనున్నారు.

కొద్ది రోజులు ముందుగానే ప్రకటించిన ఈ పురస్కార్నాన్ని గురువారం ఆగష్టు 15స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందజేయనున్నారు. 73వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా లక్షల మంది సైన్యానికి స్ఫూర్తినిచ్చేలా, అతని ధైర్య సాహసాలకు గౌరవసూచికంగా అవార్డు అందిస్తారు. ఆయనతో పాటు ఐఏఎఫ్ స్క్వాడ్రన్ లీడర్ మింటీ అగర్వాల్‌కు యుద్ధసేవా పతకాన్ని ప్రదానం చేయనున్నారు. పలువురు జవాన్లకు శౌర్యచక్ర, కీర్తిచక్ర అవార్డులను కూడా అందించనున్నారు. సర్జికల్ స్ట్రైక్స్ చేసిన భారత విమానాలను వెంబడిస్తున్న పాక్ యుద్ధవిమానాలు వచ్చాయి. వాటిని తరిమికొట్టేందుకు బయల్దేరిన అభినందన్ తప్పని పరిస్థితుల్లో పాక్ భూభాగంలో దిగాడు. పాక్ చేతిలో బందీగా చిక్కిన అభినందన్‌ను రెండు రోజుల తర్వాత పాక్ నుంచి బయటకు వచ్చాడు. దేశ రహస్యాలపై, సైన్యం ఉద్దేశ్యాలపై ఏ విషయం చెప్పకుండా మొక్కవోని ధైర్యంతో నిలిచి, స్వదేశానికి నేషనల్ హీరోగా వచ్చాడు. సైనికులకు వచ్చే గౌరవ పురస్కారాల్లో మొదటిది పరమ్ వీర చక్ర, మహా వీర చక్ర తర్వాత ఇది మూడో అత్యున్నత పురస్కారమే వీర్ చక్ర. అభినందన్‌కు భారత అత్యున్నత అవార్డు అయిన వీర చక్ర ఇవ్వాలని కోరుతూ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నామినేట్ చేసింది. తమిళనాడు సీఎం పళనిస్వామి సైతం అభినందన్ పేరును కేంద్రానికి సిఫారసు చేశారు. తమిళనాడుకు చెందిన అభినందన్ 1983 జూన్ 21న భారతదేశంలోని ఎయిర్ మార్షల్ సింహకుట్టి వర్ధమాన్‌కు జన్మించాడు. అభినందన్ తల్లి డాక్టర్, తండ్రి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో యుద్ధ విమానాల పైలట్‌గా పనిచేశాడు. ప్రస్తుతం అభినందన్ కుటుంబం చెన్నైలో ఉంటోంది.

# రక్షాబంధన్‌కు చారిత్రక ప్రాశస్త్యం



హైదరాబాద్,ఆగస్టు14 (ఆర్ఎన్ఎ): చారిత్రకంగానూ రక్షాబంధనం ఎంతో ప్రశస్తి చెందింది. రాజపుత్రుల యువ రాణి కర్ణావతి- మొగలాయి పాలకుడు హుమాయూన్‌కి రక్షను ధరింపజేసి, శత్రువుల నుంచి రక్షణ పొందిందంటారు. పురుషోత్తమ చక్రవర్తికి రాఖీ కట్టిన అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా, ఆయనకు ప్రాణభిక్ష కోరిందని చెబుతారు. ఛత్రపతి శివాజీ ఏటా పూర్ణిమనాడు తుల్జా భవానీ సమక్షంలో రక్షాబంధనం చేసుకుని, ధర్మనిబద్ధతకు పునరంకితమయ్యేవాడని చరిత్ర చెబుతోంది. మరాఠా పాలకుడు పీష్వా బాజీరావు కాలంలో, ఈ పున్నమిని నమైక్యతా దినోత్సవంగా నిర్వహించేవారంటారు. రాఖీ పండుగ ద్వారా స్వాతంత్యోద్యమ కాలంలో 'లోకమాన్య' తిలక్- భారతీయుల్లో స్వాతంత్య కాంక్ష రగిలించారు. 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాగూర్ రక్షాబంధన్ సందర్భాన్ని సామాజిక ఐక్యతా వారధిగా వినియోగించుకున్నారు. విభిన్న వర్గాల్ని ఏకీకృతం చేసిన ఆ కవీంద్రుడు, రక్షాబంధనాన్ని ఓ సంరంభంగా నిర్వహించారు. ఇలా రక్షాబంధన ఉత్సవం ఓ పర్వదినంగానే కాక- జాతీయ సమగ్రతకు, సామరస్యానికి ఉపకరించింది. జైనులు ఈ పర్వాన్ని 'రక్షక్ దివస్'గా నిర్వహిస్తారు. కొబ్బరికాయల్ని సముద్రజలాల్లో వదిలి, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థిస్తారు. శ్రావణ పూర్ణిమను 'సంతోషీ మాత జన్మదినోత్సవం'గానూ పరిగణిస్తారు. జ్ఞానానికి అధిష్ఠానదైవంగా భావించే హయగ్రీవ జయంతి నేడే! సంస్కృత భాషాదినోత్సవంగానూ ఈ పున్నమి ఖ్యాతి సంతరించుకుంది. ఇలా పలు విశేషాంశాల సమాహారంగా శ్రావణ పూర్ణిమ వర్ధిల్లుతోంది!

# నిరంతర విద్యుత్‌తో మారిన వ్యవసాయ ముఖచిత్రం

### ప్రాజెక్టుల నిర్మాణంతో సాకారం కానున్న కోటి ఎకరాల సాగు

### తెలంగాణ పాలన దేశానికి ఆదర్శమన్న మంత్రి ప్రశాంత్

నిజామాబాద్,ఆగస్ట్14 (ఆర్ ఎన్ఎ): వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వండంతో ప్రస్తుత వ్యవసాయ రంగ ముఖచిత్రం మారిపోయిందని మంత్రి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కరెంట్ ఉత్పాదనపై సిఎం కెసిఆర్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. గృహావసరాలకు 24 గంటల విద్యుత్ నిరంతరాయంగా వస్తోందని అన్నారు. ఇక వ్యవసాయానికి కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా సాగుతోందని అన్నారు. కోటి ఎకరాలకు సాగునీరం దించందుకు పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం జరుగు తుందని స్పష్టం చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు కాళేశ్వ రం ద్వారా గోదావరి జలాలు తీసుకొస్తామని చెప్పారు. వచ్చే ఏడాది వానకాలం నుంచి ఏటా 2 పంటలకు నీళ్లు ఇస్తామని ప్రకటించారు. నిజాంసాగర్ కాలువలను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తున్నామని గుర్తు చేశారు. సింగూరు నీళ్లిచ్చి పంటలు ఎండిపోకుండా చూసామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు మంత్రితెలిపారు. కోటి ఎకరాలకు నీరందించేందుకు పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సాగు, తాగునీటి కష్టాలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మిస్తోందన్నారు. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్‌కు పూర్వవైభవం కల్పించేందుకు సుమారు రూ.2 వేల కోట్లతో రివర్స్ పంపింగ్ పనులకు ప్రభుత్వం శంకుస్థాపన చేసిందన్నారు. రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగు తోందని, కేంద్రం తో పాటు ఇతర రాష్ట్రాలు సీఎం కేసీఆర్ పాలనను మెచ్చుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో పేదలు, వృద్ధులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, వికలాంగులు, ఒంటరి మహిళలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దళితులకు మూడెకరాల భూమితో పాటు సాగుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండాలని డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తోందన్నారు. పేద వాడికి కడుపు నిండ అన్నం అందించేందుకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉన్నా, వారికి బియ్యం అందిస్తుందన్నారు. పేదింటి యువతులకు వివాహం భారం కాకూడదని కల్యాణిలక్ష్మి, షాదీముబారక్ ద్వారా రూ.75 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఇప్పటికే రైతుల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, వచ్చే ఏడాది నుంచి రైతులకు నేరుగా ఎకరానికి నాలుగు వేల చొప్పున అందించేందుకు సిద్ధమైందన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే చూస్తు ఊరుకోమని, తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## కాల్వలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

### విద్యార్థులకు తప్పిన ముప్పు

కామారెడ్డి,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేవాయిపల్లి శివారులో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తుండగా.. మూలమలుపు వద్ద బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 32 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు ఓ వైపు ఒరిగిపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పాతకాలం నాటి బస్సును విని యోగిస్తున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పాఠశాల యాజమాన్యం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లకు ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# తెలంగాణకు కేంద్రం నిధులిస్తుంది

### - రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయట్లేదు
### - మజ్లిస్‌ను చంకలో పెట్టుకున్న కేసీఆర్.. మతోన్మాదం అంటే ఎలా?
### - 18న జరిగే సభలో 20వేల మంది బీజేపీలో చేరుతారు
### - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

వరంగల్, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తుందని, కానీ కేసీఆర్ ప్రభుత్వం మాత్రం వాటిని ఖర్చుచేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం వరంగల్‌లో పర్యటించిన ఆయన.. విలేకరులతో మాట్లాడారు.. కశ్మీర్ విషయంలో కాంగ్రెస్ ఆరోపణలు సరికాదన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పులను బీజేపీ సరిదిద్దుతోందన్నారు. ఇదే సమయంలో టీఆర్ఎస్‌పైనా లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో కుటుంబ పాలన సాగుతోందన్నారు. కమిషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. కేంద్రం నిధులు మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయకుండా అడ్డుకుంటోందన్నారు. ఈ నెల 18న బీజేపీలో 20,000 మంది చేరుతున్నారని వెల్లడించారు. మజ్లిస్ పార్టీని చంకలో పెట్టుకున్న సీఎం కేసీఆర్, మతోన్మాదం అంటూ మాట్లాడితే బాధేస్తోందని లక్ష్మణ్ అన్నారు. కేసీఆర్ చెబుతున్న శ్రీరంగ నీతులు విని ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన చెప్పారు. తెలంగాణలో కమిషన్ల కోసమే ప్రాజెక్టులు చేపడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో వారసత్వ పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు తామంతా సైనికుల్లా పనిచేస్తున్నామని తెలిపారు. తమతో 20 మంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని లక్ష్మణ్ వెల్లడించారు. టీఆర్ఎస్-కాంగ్రెస్ ఒక్కటైనా బీజేపీ చేతిలో ఓడిపోక తప్పదని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

# పాలమూరు ప్రాజెక్టులపై కేసీఆర్ నజర్

### త్వరలోనే ప్రాజెక్టుల సందర్శన
### అధికారులతో సమీక్షించి వివరాలుసేకరించిన మంత్రి

మహబూబ్‌నగర్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): పాలమూరు ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయించేందుకు సిఎం కెసిఆర్ నడుం బిగించారు. ఈ మేరకు ప్రాజెక్ట్ పనులను పరిశీలించేందుకు సిఎం కెసిఆర్ రానున్నట్లు సమాచరం. సీఎం కేసీఆర్ ఈ నెల 21 పాలమూరు పర్యటనకు రానున్నారని ఇక్కడి టిఆర్ఎస్ వర్గాలు తెలపాయి. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించేందుకు వస్తారని సమాచారం.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా పూర్తి చేసేందుకే సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఇప్పటికే కాళేశ్వరం పనులు పూర్తయిన నేపథ్యంలో సీఎం పాలమూరుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అందుకే స్వయంగా వచ్చి ప్రాజెక్టు పనులను పరిశీలించి రివ్యూ చేసేందుకు నిర్ణయించారు. ప్రాజెక్టు పనుల వేగవంతానికి తీసుకునాల్సిన అన్ని నిర్ణయాలను సీఎం ఈ పర్యటనలో పూర్తి చేసే అవకాశం ఉంది. ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసి 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. సీఎం కేసీఆర్ పర్యటనపై తమకు సమాచారం ఉందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మొదట కొల్లాపూర్ సమీపంలో సోమశిల, అమరగిరి, కోతిగుండు ప్రాంతాల్లో కృష్ణానది వెంట ఆయన ఏరియల్ సర్వే చేస్తారు. పాలమూ రు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటిని తీసుకునే కోతిగుండు ప్రాంతం నుంచి లిఫ్ట్-1, నార్లాపూర్ రిజర్వాయర్, కొత్తపేట సమీపంలో టన్నెల్ పనులను హెలీక్యాప్టర్ నుంచే పరిశీలించనున్నారు. తర్వాత ఎంజీకేఎల్ఐ పరిధిలోని ఎల్లూరు, సింగోటం రిజర్వాయర్లను సైతం పరిశీలిస్తారు. ఆ తర్వాత నేరుగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా దాదాపు పనులు పూర్తి కావచ్చిన ఏదుల రిజర్వాయర్ వద్దకు చేరుకుని రిజర్వాయర్ పరిశీలన అనంతరం అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం వట్టెం, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తూ హైదరాబాద్ చేరుకుంటారు. సీఎంతో పాటు జిల్లా మంత్రులు, ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేలు ఏరియల్ సర్వే, సమీక్షలో పాల్గొననున్నారని సమాచారం. ఇదిలావుంటే పాలమూ రు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులతో ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గం పరిధిలో, మహబూబ్‌నగర్ జిల్లాకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఉమ్మడి పాలమూరు కరువును శాశ్వతంగా పారదోలే విధంగా సీఎం కేసీఆర్ ప్రతిపాదనలు రూపొందించారని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు మరింత వేగంగా పూర్తిచేసే అంశంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని ఆయన అన్నారు. అందులో భాగంగానే త్వరలో ఆయన పాలమూరు రానున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు పనులను పరిశీలించడంతో పాటు సమీక్ష సైతం నిర్వహించనున్నారని శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. మహబూబ్‌నగర్ కొత్త చెరువు నుంచి మినీట్యాంక్ బండ్‌కు, ఉదండాపూర్ నుంచి మయూరిపార్కుకు నీళ్లు అందించాలని అధికారులను ఆయన కోరారు.

ప్రాజెక్టు పనుల వేగవంతంపై అధికారులు మరింత సమర్థంగా పనిచేయాలని ఆయన కోరారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి జరుగుతున్న పనులు, రిజర్వాయర్లు, లిఫ్టుల వివరాలు, వ్యాపులు ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు మంత్రికి వివరించారు.

## మోదీ- అమిత్‌షాలు కృష్ణార్జునులైతే..

# పాండవులు, కౌరవులు ఎవరు?

### - రజనీకాంత్ వ్యాఖ్యలపై మండిపడిన అసదుద్దీన్
### - కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును సుప్రీంలో సవాల్ చేస్తా

హైదరాబాద్, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : ప్రధాని నరేంద్ర మోదీ - అమిత్ షాలను కృష్ణార్జునులుగా పోలుస్తూ.. రజనీకాంత్ చేసిన వ్యాఖ్యల పట్ల దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, రజనీ వ్యాఖ్యలపై మండి పడ్డారు. మోదీ-అమిత్ షాలు కృష్ణార్జునులైతే.. మరి పాండవులు, కౌరవులు ఎవరు అని ఒవైసీ ప్రశ్నించారు. ఈద్ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఒవైసీ మాట్లాడుతూ.. 'దేశ చరిత్రలో ఇప్పటికే రెండు చారిత్రక తప్పిదాలు నమోదయ్యాయి. ఒకటి 1953లో షేక్ అబ్దుల్లాను అరెస్ట్ చేయడం.. రెండు 1987లో జరిగిన ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడటం. తాజాగా జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడదీస్తూ.. మోదీ ప్రభుత్వం మూడో తప్పిదం చేసిందని అన్నారు. మోదీ చర్యలను ఓ తమిళ యాక్టర్ ప్రశంసిస్తూ.. మోదీ-అమిత్ షాలను కృష్ణార్జునులతో పోల్చాడు. మరి పాండవులు, కౌరవులు ఎవరు. దేశంలో మరో మహాభారత యుద్ధం జరగాలని వారు కోరుకుంటున్నారా అని ఒవైసీ ప్రశ్నించాడు. అంతేకాక నెహ్రూ, వల్లభాయ్ పటేల్‌లకున్న రాజకీయ దూరదృష్టి ఇప్పటి పాలకులకు లేదని ఒవైసీ అన్నారు. ఈ ప్రభుత్వానికి కశ్మీర్ ప్రజల పట్ల ఎలాంటి ప్రేమ లేదని, వారు కేవలం అధికారాన్నే ప్రేమిస్తారని విమర్శించారు. పదవిలో కొనసాగడం కోసమే కశ్మీర్‌ను విభజించారని, ఈ ప్రభుత్వ చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నామని ఒవైసీ తెలిపాడు. అంతేకాక జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఒవైసీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

## కచ్ తీరంలో భద్రత కట్టుదిట్టం

### ఐబి హెచ్చరికలతో అప్రమత్తం

అహ్మదాబాద్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): గుజరీత్ తీరంలో కచ్ వద్ద భారత్-పాక్ సరిహద్దుల గుండా ఉగ్రవాదులు చొరబాడే అవకాశం ఉందంటూ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) గుజరాత్ పోలీసులను తాజాగా హెచ్చరించింది. దీంతో కచ్ సరిహద్దుల్లో భారీగా రాష్ట్ర, నావికాదళ, సరిహద్దు పోలీసు బలగాలను మోహరించారు. ఐబీ సమాచారంపై తూర్పు కచ్ ఎస్పీ పరీక్షిత రాథోడ్ మాట్లాడుతూ, ఎలాంటి ఉగ్ర చొరబాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సరిహద్దు ఏరియాల్లో మరిన్ని మెరైన్, బోర్డర్ పోలీసు బృందాలను తరలించినట్టు చెప్పారు. అనుమానాస్పద వాహనాలు, పడవలు, వ్యక్తులను చూసినట్లయితే తమకు తెలియజేయాల్సిందిగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలను, మత్స్యకారులను అప్రమత్తం చేశామన్నారు. వాహనాల తనిఖీలు కూడా చేపట్టినట్టు చెప్పారు. కాగా, ఐబీ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అనుక్షణం ఆయుధాలతో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

# నిరంతర విద్యుత్ దేశానికి ఆదర్శం : ఎమ్మెల్యే

జనగామ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు లేకుండా చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు.

ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదన్నారు. వ్యవసాయానికి కూడా 24 గంటల విద్యుత్ ఇవ్వడం దేశంలోనే ప్రథమమని అన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణ కావాలని ప్రాజెక్టులను నిర్మిస్తుంటే కాంగ్రెస్ వారు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఇలాంటి వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండాలని డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తోందన్నారు. పేద వాడికి కడుపు నిండ అన్నం అందించేందుకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉన్నా, వారికి బియ్యం అందిస్తుందన్నారు. పేదింటి యువతులకు కల్యాణిలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లక్షరూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తుందని తెలిపారు.రైతులకు నేరుగా ఎకరానికి ఐదువేల చొప్పున అందించడం ఎక్కడైనా ఉందా అని అన్నారు.

# కాలుగాలిన పిల్లిలా పాక్ తీరు

### ఐరాసకు లేక రాసి చర్చించాలని పట్టు

ఇస్లామాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు, రాష్ట్ర విభజన ఘటనల్ని ఇంకా జీర్ణించుకోలేకపోతోన్న పాకిస్థాన్ కాలుగాలిన పిల్లిలా గంతులేస్తోంది. ఎలాగైనా భారత్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలపాలని చూస్తోంది. అంతేకాకుండా భారత్ మీద అక్కసు పెంచుకుంటోంది. కశ్మీర్ మీద ఆశ చావక రోజుకో దేశాన్ని మద్దతు కోసం ఆశ్రయిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా మళ్లీ పాక్ ఐరాసను ఆశ్రయించింది. జమ్మూకశ్మీర్ అంశంపై భారత్ తీసుకున్న నిర్ణయంపై అత్యవసర సమావేశాన్ని జరిపించాలని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి లేఖరాసింది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి షా మహమూద్ ఖురేషీ యూఎన్ఎస్‌సీ అధ్యక్షుడు జొవాన్న రొనెక్కాకు లేఖ రాశారని అక్కడి మీడియా తెలిపింది. భారత్ తీసుకుంటున్న చర్యల వల్ల అంతర్జాతీయ సమాజంలో శాంతికి విఘాతం కలుగుతోంది. ఈ విషయంపై అత్యవసర విచారణ జరపాలని కోరుకుంటున్నాం. మా నిగ్రహాన్ని చేతగానితనంగా భారత్ భావిస్తోంది' అని లేఖలో పేర్కొన్నారు. అయితే ఈ లేఖపై 15సభ్యుల కమిటీ ఎలా స్పందిస్తుందో తెలియరాలేదు. అయితే దీనిపై పోలాండ్ విదేశీ మంత్రి జాసెక్ జాపుటోవిజ్ స్పందించారు. పాక్ నుంచి ఐరాసకు లేఖ అందిందని, దానిపై చర్చించుకుని నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు పాక్ ప్రయత్నాలు తిప్పి కొట్టాయి. ఇది భారత్ అంతర్గత వ్యవహారంగా చూపాయి.

క్రీడలు

# సచిన్ మొదటి సెంచరీ చేసింది ఈ రోజే..



ముంబయి: లిటిల్ మాస్టర్, రికార్డుల రారాజు సచిన్ టెండూల్కర్ మొదటి అంతర్జాతీయ సెంచరీ నమోదు చేసింది ఈ రోజే(ఆగస్టు14,1990). సరిగ్గా 30 సంవత్సరాల క్రితం ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్ రెండవ ఇన్నింగ్స్‌లో 17 సంవత్సరాల సచిన్ రమేష్ టెండూల్కర్ సెంచరీ(119)తో ఇండియాను పోటీలో నిలబెట్టాడు. ఈ విషయాన్ని బీసీసీఐ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. 16 సంవత్సరాల చిరుప్రాయంలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సచిన్ ఎన్నో రికార్డుల తన పేరిట లిఖించుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు నమోదు చేసిన ఏకైక బ్యాట్స్‌మన్ సచిన్. అలాగే అన్ని ఫార్మాట్లలో 34,000పైగా పరుగులు. అత్యధిక వన్డే, టెస్టు మ్యాచ్‌లాడిన క్రికెటర్ సచినే కావడం గమనార్హం.

గ్రాహం గూచ్ నేతృత్వంలోని ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 519 పరుగులు చేయగా, ఇండియా 408పరుగులు చేసింది. ఇందులో సచిన్ అర్ధసెంచరీ(68) కూడా ఉంది. 87పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఇంగ్లాండ్ 320పరుగులకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇండియాకు 408పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

సచిన్ ఒంటరి పోరాటం.. సహచరుల అభినందనలు...

408 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 110పరుగులకే టాపార్డర్ వికెట్లను చేజార్చుకుంది. కానీ, ఒక్కడు మాత్రం ఇంగ్లాండ్‌కు పరీక్ష పెట్టాడు. ఓపిగ్గా ఆడిన సచిన్ 17 బౌండరీల సాయంతో 119పరుగులు చేశాడు. దీంతో, ఒక్కసారిగా స్టేడియమంతా చప్పట్లతో మార్మోగింది. సహచర ఆటగాళ్లు సైతం సచిన్‌ను అభినందించారు.

# ముందుగానే రాఖీ కట్టించుకున్న బుమ్రా..




ముంబయి: టీమ్ ఇండియా ఫాస్ట్ బౌలర్, వరల్డ్ నంబర్ వన్ ర్యాంకర్ జస్ప్రీత్ బుమ్రా రాఖీ పండుగను రెండు రోజులు ముందుగానే జరుపుకున్నాడు. తన సోదరి జుహికా రాఖీ కడుతున్న ఫోటో ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన అతడు..రక్షాబంధన్ రోజు అందుబాటులో ఉండను కాబట్టి జుహికాతో పండుగ సంబరాలను ముందే జరుపుకున్నాను. సన్నిహితంగా, ప్రేమగా ఉండే తన సోదరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపాడు.

త్వరలో భారత్ వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడబోతోంది. పండుగకు ముందుగానే బుమ్రా కరీబియన్ దేశానికి వెళ్లనున్నాడు. ఆగస్టు 22 నుంచి ఈ సిరీస్ ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఇండియా వెస్టిండీస్‌తో వన్డే మ్యాచ్‌లు ఆడుతుంది. ఇంతకు ముందు విండీస్‌తో ఆడిన టీ20 సిరీస్‌ను 3-0తో వైట్‌వాష్ చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు సిరీస్‌ల్లోనూ బుమ్రాకు విశ్రాంతి కల్పించారు.

# జోరుగా రాఖీల విక్రయాలు

### రకరకాల రాఖీలతో మార్కెట్లో అమ్మకాలు
### ఫ్యాన్సీ రాఖీలపై మగువల మక్కువ
### రకరకాల రాఖీలతో మార్కెట్లలో సందడి

హైదరాబాద్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): రాఖీల క్రయవిక్రయాలతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. రాఖీ దుకాణాలు, స్వీట్ షాపులు కొనుగోలు దారులతో సందడి వాతావరణం నెలకొంది. రెండు రూపాలయాల నుంచి రూ.వెయ్యి విలువగల రాఖీలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. రంగు నూలుదారం నుంచి వెండి, బంగారు పూత రాఖీలు మార్కెట్లో వచ్చాయి. అంతేకాకుండా టెక్నాలజీకి అనుగుణంగా ఫొటో విత్ రాఖీలు కూడా మార్కెట్‌లోకి రావడంతో ఈసంవత్సరం మహిళలు ఈ రాఖీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాడవాడలా రాఖీ దుకాణాలు వెలిశాయి. దీంతో పట్టణమంతా రాఖీలతో సందడిగా మారిపోయింది. హైదరాబాద్ నహా అనేక ప్రాంతాల్లో రాఖీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

రాఖీ పండుగ కోసం మార్కెట్‌లలో మహిళలు పెద్ద ఎత్తున షాపింగ్ చేస్తున్నారు. ఈసారి కొత్తగా వచ్చిన ఫ్యాన్సీ రాఖీలకు మంచి గిరాకీ లభిస్తోంది. నగరంలోని అనేక ప్రాంతాలలో అన్ని చోట్లా రాఖీలను అమ్మే దుకాణాలు వెలిశాయి. దీంతో యువతులు, మహిళలు తమ సోదరులకు కట్టే రాఖీలు వారికి హుందాతనాన్ని పెంచేలా ఉండాలని ఖరీదు ఎక్కువైనా మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. పలు ప్రాంతా ల్లో రాఖీలు రూ.5 నుంచి రూ.500 వరకు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఫ్యాన్సీ రాఖీలతో పాటు వెండి రాఖీలు, చందనంతో కూడిన రాఖీలు, ముత్యాల రాఖీలు, నెమలి ఈకల రాఖీలు, చేతితో తయారుచేసిన వినూత్న డిజైన్ల పూసల రాఖీలు, కాగితం రాఖీలు, దూది రాఖీలు ఉన్నాయి. బేగంబజార్, సికింద్రాబాద్, అంబర్‌పేట, ధూల్‌పేటలలో రాఖీలు హోల్‌సేల్ ధరల్లో అందుబాటులో ఉండడంతో చాలా మంది కుటుంబాల సమేతంగా అక్కడకు వెళ్లి రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. రాఖీలతో పాటు మిఠాయిలు అమ్మే స్వీట్ హౌస్‌లలో కూడా సందడి కనిపిస్తోంది. పలు స్వీట్ దుకాణాలలో రక్షాబంధన్ కోసం రకరకాల స్వీట్లను తయారుచేస్తున్నారు. ఇప్పటికే దూర ప్రాంతాల్లో సోదరులు ఉండి వారిని స్వయంగా [illegible] కలువలేకపోయేవారు రాఖీల ను కొనుగోలు చేసి పోస్టుల ద్వారా పంపగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పుట్టిల్లు ఉన్నవారు పండుగరోజున సోదరులను కలుసుకునేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. సోదర బంధానికి ప్రతీక.. అనురాగం, ఆప్యాయతలకు చిరునామా.. అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగానికి చిహ్నంగా రాఖీ వేడుకలు నిర్వహిస్తారు. సోదరికి నేనున్నానంటూ భరోసా ఇచ్చే రక్షా కంకణం.. అదే రాఖీ. ఈపండుగను గురువారం శ్రావణ పౌర్ణమి నాడు ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. స్థితికారుడైన విష్ణుమూర్తి జన్మనక్షత్రం శ్రవణం. ఈ నక్షత్రం పూర్ణిమ నాటి చంద్రుడితో కూడిన మాసం కనుక శ్రావణమని శాస్త్రవచనం. ఈ పవిత్ర నక్షత్రంలో పౌర్ణమిరోజు జరుపుకునే పండుగే రాఖీపండుగ. ఈపండుగను శ్రావణపూర్ణిమ, రక్షకా పూర్ణిమ, జంధ్యాల పున్నమి అనే పేర్లతో పిలుస్తారు. శ్రావణపూర్ణిమ నాడు లక్ష్మీనారాయణుల ఆరాధన విశేష ఫలితాలు ఇస్తుంది. అమ్మ కురిపించే ఆప్యాయత, నాన్న కల్పించే భద్రత రెండింటినీ అన్నయ్యలు తమ చెల్లెళ్లకు కల్పిస్తారని నమ్మకం. ఆత్మీయ బంధాలకు ప్రతిబింబంగా జరుపుకునే ఈ వేడుక వచ్చిందంటే సందడి వాతావరణం నెలకొంటుంది.

## కృష్ణా వరద ముంపులో..

# చంద్రబాబు కరకట్ట నివాసం..!

- నివాసంలోకి నీరుచేరకుండా ఇసుక బస్తాలు వేసిన సిబ్బంది
- బాబు నివాసం వద్ద పర్యటించిన ఎమ్మెల్యే ఆర్కే
- ముంపుతో ఎప్పటికైనా ఖాళీ చేయక తప్పదని వ్యాఖ్య

అమరావతి, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : కష్ణమ్మ పరవళ్లతో ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు పోటెత్తుతోంది. దీంతో నీటమునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఇక కృష్ణానది కరకట్టపై టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు ఉంటున్న నిర్మాణానికి వరద ముప్పు పొంచి ఉంది. దీంతో నివాసంలోకి నీరు చేరకుండా సిబ్బంది ఇసుక బస్తాలు వేస్తున్నారు. వరదల నేపథ్యంలో ఇప్పటికే చంద్రబాబు కాన్వాయ్‌ను హ్యాపీ రిసార్ట్స్‌కి తరలించారు.

ఇంట్లోని కింది గదుల్లో ఉన్న సామాన్లను మేడపైకి తరలించారు.

కాగా చంద్రబాబు మంగళవారం సాయంత్రమే కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు పయనమయ్యారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి వస్తున్న వరదల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్‌లో నీటిమట్టం 12.3 అడుగులకు చేరుకుంది. 3.07 టీఎంసీల సామర్థ్యమున్న బ్యారేజీ పూర్తిగా నిండిపోయింది. ఇన్‌ఫ్లో 4.12 లక్షల క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 4.12 లక్షల క్యూసెక్కులుగా ఉంది. వరదలు ఇలాగే కొనసాగితే కరకట్ట పూర్తిగా మునిగిపోయే ప్రమాదం ఉందని అధికారులు చెప్తున్నారు. ఇదిలా ఉంటే ప్రకాశం బ్యారేజీలో వరద ఉధృతి భారీగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగానే చంద్రబాబు నాయుడు నివాసం ఉంటున్న లింగమనేని గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎగువన గల పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీ వరద వస్తోందని, చంద్రబాబు నివాసంలోకి వరద నీరు వచ్చి చేరుతోందని తెలిపారు. అక్రమ నివాసాన్ని కాపాడుకునేందుకు లారీలతో ఇసుకను తరలిస్తున్నారని, ఇల్లు మునిగిపోతుందన్న భయంతోనే చంద్రబాబు ఇంటిని వదిలి హైదరాబాద్‌కు పారిపోయారని ఆర్కే ఎద్దేవా చేశారు. కృష్ణా వరదను ముందే ఊహించిన చంద్రబాబు వారి కుటుంబ సభ్యులకు చెందిన వాహనాలను ముందే హ్యాపీ రిసార్ట్స్‌కు తరలించారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సరైన వర్షాలు పడక, వరదలు రాలేదు కనుకే ఆయనకు ఇక్కడి పరిస్థితి అర్థంకాలేదని ఆర్కే అన్నారు. ఇప్పుడు కాకపోయిన భవిష్యత్తులోనైనా చంద్రబాబు నాయుడు అక్రమ కట్టడాన్ని ఖాళీచేయక తప్పదని ఆయన హెచ్చరించారు.

# ఎగువనుంచి కొనసాగుతున్న వరద

### కృష్ణా,తుంగభద్ర తీర గ్రామాల్లో ప్రజల అప్రమత్తం
### అధికారుల పర్యటన..రెస్క్యూ సిబ్బంది సిద్ధం

మహబూబ్‌నగర్,ఆగస్ట్14(ఆర్ఎస్ఎ): ఎగువనుంచి వస్తున్న వరదల కారణంగా కృష్ణా, తుంగభద్ర నదీతీర గ్రామాల్లో అధికారులు ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశారు. రెండు నదుల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉన్నందున నదీ తీర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లకూడదని మానవపాడు మండలంలోని మదద్దారు, కొర్విపాడు, వ÷-లలేపాడు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వీఆర్వో, వీఆర్ఏలను గ్రామాల్లోనే ఉన్నారు.

ప్రజలు ఎవరూ నదిలోకి, చేపల వేటకు వెళ్లవద్దని గ్రామంలో దండోరా వేయించారు. ఉండవెల్లి మండలంలోని పుల్లూరు, మెన్నిపాడు, కల్లుగోట్ల గ్రామాల మీదుగా తుంగభద్ర నది భారీగా ప్రవహిస్తున్నది. అధికారులు గ్రామాలను సందర్శించి నదిలో వరద ప్రవాహాన్ని ఆయా గ్రామాల ప్రజలు నదీ ప్రవాహాన్ని బట్టి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. నిరంతరం పోలీసులు, రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గజ ఈతగాళ్లు, రిస్క్ సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద భారీగానే చేరుతోంది. కర్ణాటకలోని ఎగువన కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు వరద స్థిరంగా కొనసాగుతోంది. ఎగువన వానలు కురుస్తుండటంతో డ్యాంకు వరద భారీగా కొనసాగుతుండటంతో 33 గేట్లను ఎత్తి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణా, తుంగభద్రలు సంగమం సుంకేసుల నుంచి వచ్చిన వరద అలంపూర్ సమీపంలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో సంగమమైంది. ఏటా తుంగభద్ర నది నీటిపై భారీగా ఆధారపడే శ్రీశైలం ప్రాజెక్టు ఈసారి కేవలం కృష్ణానది వరదతోనే నిండింది. అలంపూర్ సమీపంలోని శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో చేరడంతో రెండు నదుల సంగమమైంది. కృష్ణా, తుంగభద్రల సంగమం తర్వాత ఆ ప్రాంతంలో మహా సముద్రాన్ని తలపిస్తోంది. క్రమంగా ఈ సంగమం ప్రభావం వల్ల శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతున్నది. మరోవైపు గంటగంటకు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 10 గేట్లను 42 అడుగుల మేర ఎత్తడంతో పాటు కరెంటు ఉత్పత్తి కలిపి మొత్తం 8.20 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఒక వైపు జూరాల నుంచి కృష్ణమ్మ స్థిరంగా భారీ ప్రవాహంతో వస్తోంటే.. మరోవైపు తుంగభద్ర బిరబిరా పరుగులు పెడుతూ శ్రీశైలం వచ్చింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 10 గేట్లను ఎత్తి వరద జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. అటు కృష్ణ, ఇటు తుంగభద్ర ద్వారా భారీగా వరద వస్తున్న నేపథ్యంలో రెండు నదుల పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నారాయణ పేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూలు జిల్లాల అధికార యంత్రాంగం వరద పరిస్థితిపై 24 గంటలపాటు అప్రమత్తంగా పనిచేస్తోంది.

# హర్యాణాలో దారుణ ఘటన

### సర్వీస్ రివాల్వర్‌తో పోలీస్‌అధికారి ఆత్మహత్య

ఫరీదాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): హర్యాణలోని ఫరీదాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. సీనియర్ పోఈస్ ఆఫీసర్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పోలీస్ శాఖలో కలకలం రేగింది. ఫరీదాబాద్ పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం ఉదయాన్నే ఆయన తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని మృతి చెందారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈయన మృతిపై ఫరీదాబాద్ ప్రజా సంబంధాల అధికారి సూబే సింగ్ మాట్లాడారు.

'ఫరీదాబాద్ ఎన్ఐటీ డీసీపీ విక్రమ్ కపూర్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. నగరంలోని సెక్టార్ 30 పోలీస్ లేన్స్‌లోని తన నివాసంలో ఉదయం 6గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని చెప్పడానికి చింతిస్తున్నాం. మృతికి గల కారణాలపై విచారణ జరుగుతోందని తెలిపారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారి ఆత్మహత్యతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఆరా తీస్తున్నారు.

## గోల్కొండలో భద్రత కట్టుదిట్టం-బ్యాగులతో రావద్దన్న సిపి

హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలకు వచ్చేవారు హ్యాండ్ బ్యాగులు, బ్రీఫ్‌కేసులు, కెమెరాలు, టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు తీసుకురావద్దని నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. పంద్రాగస్టు వేడుకలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరేడ్ జరిగే సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు.

# ప్రీపెయిడ్‌తో విద్యుత్ చౌర్యానికి చెక్

హైదరాబాద్,ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): జంటనగరాల్లో విద్యుత్ ప్రీపెయిడ్ ఏర్పాటుకు మెట్రోజోన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై నగర వ్యాప్తంగా సానుకూలత వ్యక్తం అవుతోంది. దీంతో నగరంలో ఇష్టం వచ్చినట్లు బిల్లులు వచ్చే ప్రమాదం ఉండబోదని భావిస్తున్నారు. రెండు దశల్లో విద్యుత్ మీటర్ల మార్పు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

2019 చివరినాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని విద్యుత్ అధి కారులు ప్రణాళికలు రూపొందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉదయ్ స్కీంలో తెలంగాణ విద్యుత్ శాఖకు చేర్చడంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. ఈ పథకం ద్వారా నగరమంతా ప్రీపెయిడ్

మీటర్లు ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే నగరంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ కార్యాలయాల్లో ఏర్పాటుకు ముందు రూ.200 రీచార్జి చేసి మీటర్లు వినియోగించేలా కార్యాచరణ చేపట్టారు. ఇది సామాన్యులకు మేలు కలుగచేస్తుందని విద్యుత్ అధికారులు అంటున్నారు. అలాగే విద్యుత్ చౌర్యం, బిల్లుల ఎగవేతకు చెక్ పడుతుందని అన్నారు.

## అధికరణ 370 రద్దు తీరు..

# రాజ్యాంగ విరుద్ధం

### - కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు14(ఆర్ఎన్ఎ) : కేంద్ర ప్రభుత్వం అధికరణ 370 రద్దు విధానం రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఆమె మంగళవారం ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో విలేకరులతో మాట్లాడారు. జమ్మూ-కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి రద్దుపై మౌనం వీడారు. జమ్మూ-కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న భారత రాజ్యాంగంలోని అధికరణ 370ని రద్దు చేసిన తీరు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. డోన్‌భద్రలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య భూ వివాదం నేపథ్యంలో జరిగిన కాల్పుల సంఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు ప్రియాంక గాంధీ సోన్‌భద్రలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. జమ్మూ-కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగ నిబంధనను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసిన తీరు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అలాంటి పనులు చేసేటపుడు పాటించవలసిన నిబంధనలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం పాటించలేదని చెప్పారు.

క్రీడలు

# బాక్సాఫీస్ వద్ద బర్నింగ్ స్టార్ హవా..!




బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు రీసెంట్‌గా కొబ్బరి మట్ట చిత్రంతో ప్రేక్షకులని పలకరించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ లభిస్తుంది. మన్మథుడు 2 చిత్రంతో పాటు పలు స్టార్స్ సినిమాలు థియేటర్స్ లో సందడి చేస్తున్నప్పటికి సంపూ సినిమా మాత్రం మంచి వసూళ్ళతో దూసుకెళుతుంది. ఆగస్ట్ 10న విడుదలైన కొబ్బరి మట్ట చిత్రం మూడు రోజులలో 12 కోట్ల గ్రాస్ వసూళ్ళు సాదించినట్టుగా చిత్ర యూనిట్ పోస్టర్స్ ద్వారా తెలిపింది. కాకపోతే ఇక్కడే చిన్న ట్విస్ట్ ఇచ్చారు. ఫ్యాన్స్ కోసం రూ. 9 కోట్ల ఫేక్ కలెక్షన్లు యాడ్ చేసినట్టుగా వారు తెలిపారు . అంటే మూడు రోజులలో ఈ చిత్రం మూడు కోట్ల వసూళ్ళు సాధించింది. అయితే సంపూ సినిమా మూడు రోజులలో మూడు కోట్లు సాధించడం కూడా గొప్ప విశేషమే అంటున్నారు. ఈ చిత్రంలో సంపూ ఆంగ్రాయుడ్, పాపారాయుడు, పెదరాయుడు పాత్రలలో కనిపించి సందడి చేశారు. హృదయకాలేయం సినిమా దర్శకుడు సాయి రాజేష్ నిర్మాతగా మారి తెరకెక్కించిన ఈ సినిమాకు రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వం వహించారు.

# పుస్తక రూపంలో శ్రీదేవి జీవితం



అతిలోక సుందరి శ్రీదేవి ఈ లోకాన్ని, తన అభిమానులను విడిచి వెళ్లి సంవత్సరం దాటిపోయిన ఆ విషయాన్ని ఇంకా ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ లెజెండరీ స్టార్ జయంతి సందర్భంగా మరోసారి ఆమెను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పబ్లిషర్స్ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా శ్రీదేవి జీవిత చరిత్రను ఆమె భర్త బోనీకపూర్ అనుమతితో పుస్తక రూపంలో రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు.

'శ్రీదేవి : గర్ల్ ఉమెన్ సూపర్ స్టార్' పేరుతో తయారవుతున్న ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత సత్యార్థ నాయక్ రాస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఓ అభిమానిగా నేను ఎప్పుడు శ్రీదేవిని ఆరాధించేవాడిని.

ఈ రోజు నాకు భారతీచయులకు ఎంతో నచ్చిన ఓ సూపర్ స్టార్ కథను చెప్పే అవకాశం దక్కింది. ఎన్నో ఏళ్లోగా శ్రీదేవితో కలిసి పనిచేసిన తారలు కలుసుకోవటం ఆనందంగా ఉంది. అవన్ని కలిపి ఓ చిన్నారి భారత తొలి లేడీ సూపర్ స్టార్ ప్రయాణంగా పుస్తకరూపంలో తీసుకురావటం ఓ గొప్ప అనుభూతి' అన్నారు. ఈ పుస్తకాన్ని ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## రవితేజకు జోడిగా రాశీఖన్నా

మాస్ మహారాజా రవితేజ, రాశీఖన్నా ముచ్చటగా మూడోసారి జత కట్టబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. వివరాల ప్రకారం రవితేజ హీరోగా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రాశీఖన్నాను హీరోయిన్‌గా ఎంపిక చేసుకున్నారట. ముందుగా ఈ చిత్రంలో అదితిరావు హైదరి నటిస్తుందని వార్తలు వినిపించినా, ఆమెకు డేట్స్ అడ్జస్ట్ చేసే విషయంలో సమస్య రావడంతో ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నారట. యూనిట్ అదితి స్థానంలో రాశీఖన్నాను హీరోయిన్‌గా ఎంపిక చేసుకున్నారట. అన్ని సవ్యంగా జరిగితే 'బెంగాల్ టైగర్', 'టచ్ చేసి చూడు' చిత్రాల తర్వాత మూడోసారి ఈ జంట తెరపై కనువిందు చేయనుంది. డిసెంబర్ నుండి సినిమా ప్రారంభం అవుతుందట.

## ఆ సినిమాను వదిలే ప్రసక్తే లేదు: కాజల్

దాదాపు దశాబ్దం నుంచి దక్షిణాదిన అగ్ర హీరోయిన్‌గా కొనసాగుతోంది చందమామ కాజల్ అగర్వాల్. దాదాపు తెలుగు, తమిళ అగ్ర హీరోలందరితోనూ నటించింది. యంగ్ హీరోలతోనే కాదు మెగాస్టార్ చిరంజీవి వంటి సీనియర్ హీరో సరసన కూడా ఆడిపాడింది. ప్రస్తుతం విశ్వనటుడు కమల్ హాసన్ సరసన 'భారతీయుడు-2'లో కూడా నటిస్తోంది.

ఈ సినిమా కోసం కాజల్ ప్రత్యేకంగా యుద్ధ విద్యను కూడా అభ్యసించింది. అయితే ఈ సినిమా పరిస్థితి ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు ఉంది. అగ్ర దర్శకుడు శంకర్ రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్ బ్జడెట్, ఇతర సమస్యల కారణంగా ఆలస్యమవుతోంది. దీంతో ఈ సినిమా నుంచి కాజల్ తప్పుకున్నట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. తాజాగా ఆ వార్తలపై కాజల్ స్పందించింది. 'నేను 'భారతీయుడు-2' నుంచి తప్పుకున్నట్టు వస్తున్న వార్తలు విన్నాను. అది నిజం కాదు.

# తెలంగాణ రోగాల రాష్ట్రంగా మారింది

**- విద్య, వైద్యం మాఫియా చేతుల్లో నడుస్తోంది**
**- కాంగ్రెస్ భావజాలాన్ని నమ్మినవారు పార్టీలోనే ఉంటారు**
**- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క**

హైదరాబాద్, ఆగస్టు14(ఆర్ ఎన్ఎ) : తెలంగాణ రోగాల రాష్ట్రంగా మారిందని, అయినా సీఎం కేసీఆర్, వైద్యశాఖ మాత్రం పట్టించుకోవటం లేదని వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. తెలంగాణలో ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయని, ప్రమాదకర వ్యాధుల భారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం కనీసం హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించే ప్రయత్నం చేయకపోవటం దారుణమన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి కేంద్రం చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 19 నుంచి రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో పర్యటిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ రాజమహల్ నుంచి బయటకొచ్చి చూస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం మాఫియా చేతుల్లో నడుస్తోందని భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన వారు, ఇప్పుడు కష్టకాలంలో పార్టీని వీడుతున్నారని అన్నారు. ఇలాంటి వారి వల్ల పార్టీకి వచ్చే నష్టం ఏమీలేదని భట్టి పేర్కొన్నారు. కాంగ్రెస్ భావజాలాన్ని నమ్మినవారు పార్టీలోనే ఉంటారన్నారు. పార్టీని వీడినవారు కొందరు కొప్పులరాజును బద్నాం చేయడం తగదని భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తీసుకొస్తామని, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాటం సాగిస్తామని భట్టి అన్నారు.

## విద్యుత్ షాక్‌తో ముగ్గురు చిన్నారుల మృతి

**- ప్రకాశం జిల్లాలో విషాద ఘటన**

ప్రకాశం, ఆగస్టు14(ఆంఎన్ఎ) : ప్రకాశం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామంలో ముగ్గురు చిన్నారులు కరెంట్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయారు. గ్రామంలోని కోదండరామస్వామి ఆలయ ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జెండాను ఆ పార్టీ నేతలు ఏర్పాటుచేశారు. బుధవారం ఉదయం ముగ్గురు చిన్నారులు ఆ స్తంభాన్ని పట్టుకోగానే షాక్ కొట్టింది. చిన్నారుల కేకలు విన్న స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నా అప్పటికే వారి శరీరాలు తీవ్రంగా కాలిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతులను ఐదో తరగతి విద్యార్థులు షేక్ పఠాన్ గౌస్(11), షేక్ హసన్ బుడే( 11), పఠాన్ అమర్ (11)గా గుర్తించారు. పార్టీ జెండా స్తంభానికి కరెంట్ తీగలు తగలడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ముగ్గురు విద్యార్థుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్టీ జెండాను కరెంట్ తీగలు తగిలే చోట్ల ఏర్పాటు చేయడం వల్లనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉంటే ప్రకాశం జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో పాటు ఈదురుగాలులు కూడా వీస్తుండటంతో గాలులకు విద్యుత్ వైర్లు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయనీ.. విద్యుత్ శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని దానికి తగిన చర్యలు అధికారులు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మాజీ మంత్రిపై బహిష్కరణ వేటు వేసిన బీజేపీ




న్యూఢిల్లీ, ఆగస్టు 14:: హిమాచల్ ప్రదేశ్ మాజీ మంత్రి అనిల్ శర్మను బీజేపీ పార్టీ నుంచి బహిష్కరించింది. ఎవరైనా పార్టీ నియమాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే..వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అనిల్ శర్మ పార్టీ లైన్ ను దాటారు. దీంతో ఆయనను పార్టీ నుంచి బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ ఛుఘ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అనిల్ శర్మ కుమారుడు ఆశ్రయ్ శర్మను మండి (హిమాచల్ ప్రదేశ్) పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో నిలబెట్టింది. లోక్ సభ ఎన్నికల సమయంలో మాజీ కేంద్రమంత్రి సుఖ్ రామ్ బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. మాజీ కేంద్రమంత్రి సుఖ్ రామ్ కుమారుడే అనిల్ శర్మ.

# కశ్మీర్‌లో పంద్రాగస్ట్ వేడుకలకు సర్వం సిద్ధం

**శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్న అడిషనల్ డిజిపి**
**జమ్మూలో ఆంక్షల ఎత్తివేత..కశ్మీర్‌లో కొనసాగింపు**

శ్రీనగర్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): మునుపెన్నడూ లేనివిధంగా కాశ్మీర్‌లో పంద్రాగస్ట్ వేడుకలకు రంగం సిద్ధం అయ్యింది. ఈ వేడుకల్లో అమిత్ షా పాల్గొంటారని సమాచారం. ఆయనే ఇక్కడ జెండా ఎగురేస్తారని అంటున్నారు. ఇదిలావుంటే జమ్మూ ఆంక్షలు ఎత్తివేశామని, కశ్మీర్‌లో కొన్ని రోజుల పాటు ఆంక్షలు కొనసాగుతాయని జమ్మూకశ్మీర్ అడిషనల్ డీజీపీ మునీర్ ఖాన్ పేర్కొన్నారు. జమ్మూలో పాఠశాలలు, ఇతర సంస్థలు, వాణిజ్య సముదాయాలు తెరుచుకున్నాయని తెలిపారు. కశ్మీర్‌లో మాత్రం కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలు అమల్లో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం తాము పంద్రాగస్టు వేడుకలపై దృష్టి నిర్వహించామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఈ వేడుకలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. శాంతియుతంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అయితే ప్రస్తుతం 2010, 2016లో వైరల్ అయిన వీడియోలను ఇప్పుడు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇక్కడ శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. అక్కడక్కడ స్వల్ప ఘటనలు మినహాయిస్తే.. ఎక్కడ కూడా శాంతి భద్రతలకు విఘాతం కలగలేదని అడిషనల్ డీజీపీ పేర్కొన్నారు. కశ్మీర్‌పై కీలక నిర్ణయాల నేపథ్యంలో రాష్ట్రంలో కేంద్రం భారీ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. కట్టుదిట్టమైన భద్రత నడుమ సైనికులు నిత్యం పహారా కాస్తున్నారు. ఇంటర్నెట్, మొబైల్ సేవల్ని నిలిపివేశారు. ప్రముఖ రాజకీయ, వేర్పాటువాద నాయకుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడా భారీ ప్రదర్శనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు. ఈ నేపథ్యంలో ఆంక్షల సడలింపు వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన సుప్రీం కోర్టు సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కేంద్రానికి కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. పరిస్థితులు చక్కబడుతున్న కొద్దీ దశలవారీగా ఆంక్షల్ని సడలిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. తాజాగా పరిస్థితులు మెరుగవడంతో జమ్ములో ఆంక్షల్ని పూర్తిగా ఎత్తివేశారు. శ్రీనగర్‌లో మాత్రం మరికొన్ని రోజుల పాటు ఆంక్షల్ని కొనసాగించనున్నారు. పంద్రాగస్టు వేడుకలకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని, స్టూడెంట్లు, వివిధ జిల్లాల్లో పోలీసులు డ్రెస్ రిహార్సల్స్ కూడా చేస్తున్నారని చెప్పారు. కొత్త యూనియన్ టెరిటరీలో ఇండిపెండెన్స్ డే వేడుకలను ఘనంగా జరుపుతామన్నారు.




# మట్టపల్లి ఆలయంలోకి కృష్ణానీరు

సూర్యాపేట,ఆగస్టు14 (ఆంఎన్ఎ): భారీ వర్షాలకు కృష్ణమ్మ నది పొంగి పొర్లుతోంది. దీంతో సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లిలో గల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోకి వరద నీరు చేరింది. ఆలయ గర్భగుడిలోకి మూడు అడుగుల మేర నీరు వచ్చింది. ప్రహారీగోడ దెబ్బతినడంతో వరద పోటెత్తుతోంది. ఈ క్రమంలో స్వామివారి దర్శనానికి

**దర్శనానికి ఇబ్బందులు**

వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎగువ నుంచి వస్తున్న నీటితో కృష్ణానది ఉప్పొంగిప్రవహిస్తోంది. నాగార్జునసాగర్ వద్ద నది ఉధృతి కొనసాగుతోంది. నీటిమట్టం పెరగడంతో గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. నాగార్జునసాగర్ క్రస్టు గేట్లన్నీ ఎనిమిది అడుగుల మేర ఎత్తడంతో ఇక్కడి కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది. పులిచింతల ప్రాజెక్టు జలాశయంగా ఉన్న ఈ ప్రాంతంలో స్వయంభువుడైన తంభోద్భవుని ఆలయం మునకకు గురికాకుండా 2009లో సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో కరకట్ట నిర్మాణం చేపట్టారు. కాగా పదేళ్ల తర్వాత ఈ కరకట్ట నుంచి పలు చోట్ల నీరు లీకవుతుండడంతో ఆలయ ప్రాంగణంలో రెండు నుంచి మూడు అడుగుల మేర నీరు చేరింది. ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో ఉదయ్ భాస్కర్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మోటార్ల సాయంతో నీటిని బయటికి పంపిస్తున్నారు. 2009లో వచ్చిన వరదలకు ఇక్కడి ఆలయం పూర్తిగా మునిగిపోయింది.

# ప్రధానిమోడీ, అమిత్‌షాలపై విమర్శ

**ర్యాపర్ సింగర్ హర్డ్ కౌర్ ట్విట్టర్ ఖాతా సస్పెన్షన్**

చండీగఢ్,ఆగస్టు14 (ఆర్ ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను విమర్శిస్తూ ఒక వీడియోను పోస్ట్ చేసిన ర్యాపర్ సింగర్ హర్డ్ కౌర్ ఖాతాను ట్విట్టర్ సస్పెండ్ చేసింది. ఖలిస్తాన్ వేర్పాటువాద ఉద్యమానికి చెందిన ముగ్గురు సహచరులతో కలసి హర్డ్ కౌర్ పాల్గొన్న ఈ 2.20 నిమిషాల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. 15 దేశాలలో తమ వేర్పాటువాద పతాకాన్ని ఎగరవేస్తామని, ప్రధానికి, హోం మంత్రికి ధైర్యముంటే దీన్ని అడ్డుకోవాలంటూ ఆమె ఈ వీడియోలో సవాలు చేసింది. ట్విట్టర్‌లో వీడియోను పోస్ట్ చేసిన తర్వాత త్వరలో విడుదల చేయనున్న తన మరో పాటకు సంబంధించిన ప్రమోషనల్ క్లిప్‌ను 39 ఏళ్ల హర్డ్ కౌర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్న హర్డ్ కౌర్ అసలు పేరు తరన్ కౌర్ ధిల్లాన్. భారతదేశంలోని మితవాద రాజకీయ పార్టీలను విమర్శిస్తూ ఆమె గతంలో కూడా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com